


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 94, పేజీలు - 08
సోమవారం, సెప్టెంబర్ 8, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




వెనుజువెలా ఆక్రమణకు
## రంగం సిద్ధం



2లో..

సొంత పార్టీలో
## అసమ్మతి సెగలు



2లో..



# స్థానిక సమరమే లక్ష్యం

### - హస్తం పార్టీ అంచనాలు అవేనా?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కామారెడ్డిలో కాంగ్రెస్ సభ ఈ నెల 15వ తేదీన జరగనుంది. బీసీలకు నలభై రెండు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఈ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి దాదాపు లక్ష మంది హాజరయ్యేలా చూడాలని ఇప్పటికే స్థానిక నేతలకు ఆదేశాలు అందాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతుండటంతో బీసీ ఓటు బ్యాంకు టార్గెట్ గా కాంగ్రెస్ పార్టీ ఈ సభను పూర్తిగా విజయవంతం చేయాలని నిర్ణయించింది. బీసీల మద్దతను వీలయినంత వరకూ పొందగలిగితే ఇక తమకు లోకల్ ఎన్నికల్లో తిరుగుండదని కాంగ్రెస్ పార్టీ అంచనా వేసింది.

**ఈ నెల 15వ తేదీన..**

అందులో భాగంగానే ఈ నెల 15వ తేదన కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభను నిర్వహించాలని తలపెట్టింది. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేసింది. వేదిక ఏర్పాటుతో పాటు జనసమీకరణపై కూడా మంత్రులు కామారెడ్డిలో పర్యటించి అక్కడి నేతలతో సమావేశమై వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలను కూడా ఆహ్వానించనున్నారు. కామారెడ్డికి సమీపంలో ఉన్న నియోజకవర్గాల నుంచి అత్యధిక సంఖ్యలో జనాన్ని తీసుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో..**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖచ్చితంగా బీసీలు క్రియాశీలకంగా

2లో..

జీఎస్టీ సంస్కరణలపై
## సమావేశం

- సాధారణ ఎంపీలా సమావేశానికి హాజరైన ప్రధాని మోదీ
- తన నిరాడంబరతను మరోసారి చాటుకున్న ప్రధాని




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నిరాడంబరతను మరోసారి చాటుకున్నారు. పార్లమెంట్ ప్రాంగణంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరిగిన బీజేపీ వర్క్‌షాప్‌లో ఆయన తోటి పార్లమెంట్ సభ్యులతో పాటు చివరి వరుసలో కూర్చొని అందరినీ ఆశ్చర్యపరిచారు. దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో ప్రభుత్వం చేపట్టిన కీలక సంస్కరణలపై జరిగిన ఈ సమావేశంలో ఆయన ఒక సాధారణ ఎంపీలా పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో జీఎస్టీ సంస్కరణలకు మద్దతుగా బీజేపీ

2లో..

# సూపర్ సిక్స్-సూపర్ హిట్

### - అనంతలో 10న భారీ సభ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో కూటమి పార్టీలు గత ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్ని దాదాపుగా అమలు చేశాయి. ఏడాది పాలన పూర్తి చేసుకున్న క్రమంలో కూటమి ప్రభుత్వం కీలకమైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి కీలక హామీల్ని నెరవేర్చేసింది. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అంతే స్థాయిలో ప్రచారం చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ నెల 10న భారీ సభ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అనంతపురంలోని ఇంద్రప్రస్థనగర్ లో ఈ నెల 10న కూటమి పార్టీలు భారీ సభను ప్లాన్ చేశాయి. ఎన్డీఏ కూటమి తొలి ఉమ్మడి సభకు సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ నేతలు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు హాజరు కానున్నారు. ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ భారీ బహిరంగ సభకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది ప్రజలు హాజరయ్యేలా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ పార్టీలు నిర్వహించే తొలి సభ కావటంతో దీన్ని

2లో..

## ఈ 15న కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ

### - మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జరుగకుండా బీజేపీ అడ్డుకుంటోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ఎప్పుడూ మతం, దేవుడి పేరుతోనే బీజేపీ రాజకీయాలు చేస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ నెల 15న కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ "కామారెడ్డి గడ్డ మీద బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాం. ఆ హామీ

2లో..

# రేవంత్ రెడ్డి వరాల జల్లు

### - హైదరాబాద్‌లో కొత్త మార్పులు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగర ప్రజలకు గుడ్ న్యూస్ నగర ప్రజల తాగునీటి అవసరాలను మెరుగుపరిచేందుకు గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ఫేజ్ 2,3 చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. గోదావరి తాగునీటి పథకం ఫేజ్ 2,3లకు సీఎం రేవంత్ రెడ్డి నేడు శంకుస్థాపన చేయనున్నారు. ఉస్మాన్ సాగర్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. రూ. 7,360 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా సిద్ధిపేట జిల్లాలో ఉన్న మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి 20 టీఎంసీల నీటిని హైదరాబాద్‌కు తరలిస్తారు. ఇందులో 2.5 టీఎంసీల నీటిని మూసీ పునరుజ్జీవం కోసం (ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ద్వారా) కేటాయించనున్నారు. మిగిలిన 17.5 టీఎంసీల నీటిని హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాల కోసం కేటాయించనున్నారు. అయితే మల్లన్నసాగర్ నుంచి నీటి తరలింపు ప్రక్రియలో భాగంగా మార్గమధ్యలోని 7 సరసులను కూడా నింపనున్నారు. అయితే ఈ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద నిర్ణయించిన ప్రభుత్వం, రెండేళ్లలో పూర్తి

2లో..

రైతుల సమస్యలపై
# వైసీపీ పోరుబాట

### - యూరియా కొరతపై ఈ 9న రాష్ట్రవ్యాప్త నిరసన



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో రైతులకు ఎదురవుతున్న ప్రధాన సమస్య యూరియా కొరత. తెలంగాణలో ఈ సమస్య చాలానే ఉంది. ఏపీ ప్రభుత్వం చర్యలతో రాష్ట్రంలో యూరియా కొరత తక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే పంటలు వేసుకునే రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. రైతులకు యూరియా కొరత సమస్యలపై వైసీపీ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని మాజీ మంత్రి బొత్ససత్యనారాయణ తెలిపారు. యూరియా కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులపై వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతుందని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. విశాఖపట్నంలో బొత్స మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 9న రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ రైతుల పక్షాన నిలిచి నిరసనకు దిగుతుంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేని యూరియా కొరత మిత్రపక్షం

2లో..

ట్రంప్ దుందుడుకు
# చర్యలు

### - ఐటీ సంస్థలకు కేంద్రం భరోసా



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఔట్‌సోర్సింగ్‌పై కఠిన వైఖరి అవలంబించవచ్చనే భయాలు పెరుగుతున్న నేపథ్యంలో భారత్ కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సుమారు 300 బిలియన్ డాలర్ల విలువైన దేశీయ టెక్నాలజీ పరిశ్రమను, దానిపై ఆధారపడిన లక్షలాది ఉద్యోగాలను

2లో..



# స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్

### - జిల్లాల పర్యటనకు సిద్ధమైన కేటీఆర్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాల పర్యటనకు సిద్ధమవుతున్నారు. గత కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ ముఖ్య నేతలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన సంచలన ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. మరోవైపు త్వరలో స్థానిక సంస్థలు నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. ఈ క్రమంలోనే కేటీఆర్ జిల్లాల పర్యటన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్టుగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో కేటీఆర్ సుదీర్ఘ మంతనాలు జరిపినట్టుగా సమాచారం.స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధం చేయడంలో భాగంగా కేటీఆర్ జిల్లాల పర్యటన ఉండబోతుందని గులాబీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

2లో..



మనకు న్యాయం జరగాలంటే
# రాష్ట్రంలో ప్రభుత్వం మారాలేమో

### - కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలనం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** "రీజనల్ రింగ్ రోడ్ లో భూములు కోల్పోతున్న చౌటుప్పల్ డివిజన్ (ఉత్తర భాగం) రైతులు తలుపు తట్టని అధికారులు లేరు. ఢిల్లీలో పెద్దల్ని కలిసినా బాధితులకు న్యాయం జరగలేదు. వాళ్లకు కావాల్సిన విధంగా జరగాలంటే ప్రభుత్వం మారాలేమో" అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం హయాంలో దివీస్ సంస్థ కోసం రూట్ అలైన్‌మెంట్ మార్చారు. ఇప్పుడు దక్షిణ భాగం మారాలంటే మొదటగా ఉత్తర భాగం అలైన్‌మెంట్ మారాలి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం అలైన్‌మెంట్ మారాలంటే రాష్ట్ర ప్రభుత్వమే మారాలేమో అని కాంగ్రెస్ నేత రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు.

**భూనిర్వాసితులతో రాజగోపాల్ రెడ్డి సమావేశం**

యాదాద్రి భువనగిరి జిల్లా

2లో..

# థాంక్యూ ఒవైసీ భాయ్

- ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఎంఐఎం మద్దతు
- మద్దతు ప్రకటించిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ
- సోషల్ మీడియా వేదికగా ఒవైసీకి ధన్యవాదాలు తెలిపిన సీఎం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉపరాష్ట్రపతి ఎన్నికల వేళ తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఫోన్ చేసి చేసిన విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామంపై సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా

2లో..



# వెనుజువెలా ఆక్రమణకు రంగం సిద్ధం

**న్యూయార్క్ (ప్రశ్న న్యూస్)** కరేబియన్ సముద్రంలో ఒక్కసారిగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న వెనుజువెలాను లక్ష్యంగా చేసుకుని అమెరికా తన సైనిక బలగాలను భారీ ఎత్తున మోహరించింది. అత్యాధునిక యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, ఫైటర్ జెట్‌లతో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టడంతో ఏ క్షణంలోనైనా వెనుజువెలాపై దాడి జరగవచ్చనే ఆందోళనలు అంతర్జాతీయంగా వ్యక్తమవుతున్నాయి. తన హయాంలో ఏడు యుద్ధాలను ఆపానని గొప్పగా చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇప్పుడు మరో దేశంపైకి సైన్యాన్ని నడిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వెనుజువెలా నుంచి మాదకద్రవ్యాల ముఠాలు అమెరికాలోకి ప్రవేశిస్తున్నాయని, వాటిని అణిచివేసేందుకే ఈ సైనిక చర్య అని ట్రంప్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ డ్రగ్స్ మాఫియాతో వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు ప్రత్యక్ష సంబంధాలున్నాయని తీవ్ర ఆరోపణలు చేసింది. అంతటితో ఆగకుండా, మదురో ఆచూకీ తెలిపిన వారికి 50 మిలియన్ డాలర్ల (సుమారు రూ.430 కోట్లు) భారీ నజరానాను కూడా ప్రకటించింది. ఇటీవలే అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా "మదురో ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి" అని నేరుగా హెచ్చరించడం గమనార్హం. మదురో ఎన్నికను తాము గుర్తించడం లేదని వైట్ హౌస్ స్పష్టం చేయడంతో, అమెరికా చర్యల వెనుక అసలు ఉద్దేశం వేరే ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి. అయితే, అమెరికా వాదనలను అంతర్జాతీయ విశ్లేషకులు కొట్టిపారేస్తున్నారు. ఇది కేవలం డ్రగ్స్ మాఫియాపై పోరాటం కాదని, వెనుజువెలాలో ఉన్న అపారమైన చమురు నిక్షేపాలపై ఆధిపత్యం కోసమే అమెరికా ఈ వ్యూహం పన్నిందని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వెనుజువెలా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని, రాజకీయంగా అస్థిరంగా ఉంది. ఇదే అదునుగా భావించి, ఆ దేశాన్ని ఆక్రమించుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని వారు ఆరోపిస్తున్నారు. సైనిక బలగాలను చూపించి బెదిరించే (గన్‌బోట్ డిప్లమసీ) ధోరణి ట్రంప్‌కు కొత్త కాకపోయినా, ఈసారి క్షేత్రస్థాయిలో సైన్యాన్ని మోహరించడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్న ప్రపంచ దేశాలు, సంయమనం పాటించాలని అమెరికాకు సూచిస్తున్నాయి. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే కరేబియన్ ప్రాంతంలో తీవ్ర పరిణామాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# సొంత పార్టీలో అసమ్మతి సెగలు

టోక్యో (ప్రశ్న న్యూస్) జపాన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. దేశ ప్రధానమంత్రి షిగెరు ఇషిబా తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్టు ప్రకటన చేశారు. ఆయన నేతృత్వంలోని అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ)లో తీవ్రస్థాయిలో నెలకొన్న అంతర్గత విభేదాలు, పార్టీలోని కొన్ని వర్గాల నుంచి వస్తున్న ఒత్తిడి ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎగువసభ ఎన్నికల్లో అధికార ఎల్‌డీపీ మెజారిటీని కోల్పోయింది. ఈ ఓటమి తర్వాత పార్టీలో ఇషిబా నాయకత్వంపై అసంతృప్తి పెరిగింది. గతేడాది 2024 అక్టోబరులో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఇషిబా, ఏడాది పూర్తికాకముందే పదవి నుంచి వైదొలగనుండడం గమనార్హం. తన రాజీనామాపై ఇషిబా స్పందిస్తూ, "పార్టీని బలోపేతం చేయడానికి, దేశ రాజకీయాలను స్థిరపరచడానికి ఈ నిర్ణయం తీసుకున్నాను" అని వివరించారు. ఆయన రాజీనామా నిర్ణయంతో జపాన్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొంది. అధికార ఎల్‌డీపీ తదుపరి నాయకుడిని ఎన్నుకునే ప్రక్రియను ప్రారంభించింది. ఈ పరిణామం జపాన్ ఆర్థిక, రక్షణ విధానాలతో పాటు ఆసియా రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలోనే కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలువడనున్నాయి.

# స్థానిక సమరమే లక్ష్యం

మారతారు. అదే సమయంలో వారికి తగిన ప్రాధాన్యత కల్పించామన్న విషయం జనంలోకి వెళ్లాలి. అది వెళ్లగలిగితే బీసీ ఓటు బ్యాంకు మాత్రం తమకు అనుకూలంగా మారుతుందని అంచనా వేస్తున్నారు. అందులో భాగంగానే ఈ కామారెడ్డి సభను ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలోనే సభ పెట్టి అక్కడ కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ ఏర్పాటు చేసింది. నాడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పోటీ చేశారు. అయితే ఆయన గెలవలేదు. అయినా సరే డిక్లరేషన్ చోటనే తాము బీసీ రిజర్వేషన్లు అమలు చేశామని చెప్పేందుకు కామారెడ్డిని ఎంచుకుంది. కులగణన చేయడంతో పాటు దాని ఆధారంగా బీసీలకు నలభై రెండు శాతం రిజర్వేషన్లను తెచ్చామని చెప్పుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుంది. మరి ఈ కామారెడ్డి సభతో బీసీ ఓటు బ్యాంకు చేరువవుతుందా? లేదా? అన్నది చూడాలి.

# జీఎస్టీ సంస్కరణలపై సమావేశం

ఎంపీలందరూ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. సెప్టెంబర్ 3న జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలతో దేశ పరోక్ష పన్నుల విధానంలో సరికొత్త శకం మొదలైంది. ఈ మార్పుల ప్రకారం, దేశవ్యాప్తంగా ఇకపై 5 శాతం, 18 శాతం అనే రెండు ప్రధాన పన్ను శ్లాబులు మాత్రమే ఉంటాయి. అయితే, సిన్ గూడ్స్ (హానికర ఉత్పత్తులు)పై 40 శాతం అధిక పన్ను వర్తిస్తుంది. ఈ సంస్కరణల ఫలితంగా పలు నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. కిరాణా సరుకులు, బట్టలు, పాదరక్షలు, ఎరువులు, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తులు వంటివి చౌకగా లభించనున్నాయి. గతంలో 12 శాతం, 28 శాతం పన్ను శ్లాబుల్లో ఉన్న అనేక వస్తువులను ఈ రెండు కొత్త శ్లాబుల్లోకి మార్చడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని అధికారులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ, మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ కింద ఉపశమనం కల్పిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఆ హామీకి అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్టు తెలుస్తోంది. ఈ మార్పుల వల్ల ప్రజల చేతిలో డబ్బు మిగిలి, కొనుగోలు శక్తి పెరుగుతుందని, తద్వారా వినియోగం పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# రేవంత్ రెడ్డి వరాల జల్లు

చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇక, తెలంగాణ కోర్ అర్బన్ ఏరియాగా ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించిన నగరంలో పెరుగుతున్న తాగునీటి అవసరాలను తీర్చడానికి ఈ ప్రాజెక్టు ఉద్దేశించబడింది. ఇక, ఓఆర్ఆర్ తాగునీటి సరఫరా ప్రాజెక్ట్ ఫేజ్ 2ను కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. జీహెచ్ఎంసీ పరిసరాలు, చుట్టుపక్కల మునిసిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఓఆర్ఆర్ వెంబడి గ్రామ పంచాయతీలకు ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీటి సరఫరా చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ఖర్చు రూ. 1,200గా ఉంది. ఇందులో భాగంగా 71 రిజర్వాయర్లు నిర్మించబడగా వాటిలో కొత్తగా నిర్మించిన 15 రిజర్వాయర్లను ఇప్పుడు ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సరూర్ నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్ నగర్, ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్, కీసర, రాజేంద్రనగర్, షామీర్ పేట్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఆర్‌సీ పురం, పటాన్ చెరు, బోలారం ప్రాంతాల పరిధిలోని 25 లక్షల మందికి మెరుగైన తాగునీటి సరఫరా జరగనుందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం వాటర్ బోర్డు అధికారులు ఔటర్ పరిధిలోని ప్రాంతాలకు కూడా తాగు నీరు అందిస్తున్నారు. అయితే పలు సమస్యల వల్ల డిమాండ్‌కు తగ్గట్టుగా నీటిని అందించలేకపోతున్నారు. ఈ క్రమంలోనే ఓఆర్ఆర్ తాగునీటి సరఫరా ప్రాజెక్ట్ ఫేజ్ 2లో భాగంగా ఆయా ప్రాంతాల్లో 71 సర్వీస్ రిజర్వాయర్ల నిర్మాణాన్ని చేపట్టారు.

## ఈ 15న కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ

మేరకు 3 బిల్లులు తీసుకొచ్చి, అసెంబ్లీలో ఆమోదింపజేసి కేంద్రానికి పంపించాం. కానీ వాటిని బీజేపీ అడ్డుకుంటోంది. బీసీల విషయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్, బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎందుకు మౌనం పాటిస్తున్నారు.? కేసీఆర్ ఫ్యామిలీలో అవినీతి సొమ్ము పంపకాల్లో తేడా రావడంతో మాజీ ఎమ్మెల్సీ కవిత బయటపెట్టింది. అదే విషయాన్ని ఐదేళ్ల కిందట చెప్పి ఉంటే రాష్ట్ర ప్రజలు నమ్మేవారు" అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్-సూపర్ హిట్

ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఏడాది కాలంలోనే అత్యంత కీలకమైన నిర్ణయాలతో పాటు ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను పూర్తి చేసి ప్రజలకు సంక్షేమం అందించటంపై ఈ సభలో ప్రధానంగా ప్రస్తావించనున్నారు. మొత్తంగా 15 నెలల పాలనా విజయాలను ఆవిష్కరించేలా సభను నిర్వహించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. సూపర్ సిక్స్ పథకాలతో లక్ష కోట్ల రూపాయలకు పైగా సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరింది. అలాగే ప్రభుత్వంగా ఇప్పటి వరకూ అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఈ బహిరంగ సభ ద్వారా ప్రజలకు చెప్పాలని కూటమి అగ్రనాయకత్వం భావిస్తోంది. ఎన్నికలకు ముందు రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీట్ల సర్దుబాటు చేసుకున్న మూడు పార్టీలు అధికారంలోకి వచ్చాక కూడా అదే పంథాతో వెళ్తున్నాయి. 15 నెలల కాలంలో మూడు పార్టీలు అత్యంత సమన్వయంతో పని చేస్తున్నాయి. అవసరమైన సమయాల్లో కేంద్రంతో, ప్రధాని మోదీతో సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేయిస్తున్నారు. ఇక నామినేటెడ్ పదవుల విషయంలోనూ మూడు పార్టీల మధ్యే అంతే సమన్వయం, సహకారం కన్పిస్తోంది. ప్రాంతాలు, జిల్లాల వారీగా ఆయా సామాజిక వర్గాల సమీకరణాలను బేరీజు వేసుకుని నామినేటెడ్ పదవుల కూర్పు చేపడుతున్నారు. కలిసి వచ్చాం, కలిసి గెలిచాం, కలిసి పని చేస్తున్నాం ఇక భవిష్యత్తులోనూ కలిసే ఉంటాం అనే రీతిలో ఓ బలమైన సంకేతాన్ని ఈ వేదిక ద్వారా పంపాలన్నది కూటమి నేతల లక్ష్యంగా కన్పిస్తోంది.

# రైతుల సమస్యలపై వైసీపీ పోరుబాట

ఉన్నప్పటికీ ఏపీలోనే ఎందుకు ఉంది అని ప్రశ్నించారు. వర్షాలు కురిసినా రాష్ట్రవ్యాప్తంగా రైతులకు యూరియా అందడం లేదు. వ్యవసాయశాఖ మంత్రి తక్షణమే రాష్ట్రంలో యూరియా కొరతపై రైతుల సమస్యల పరిస్థితిని సమీక్షించాలన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై వైసీపీ అసెంబ్లీ సాక్షిగా గళం విప్పుతుందన్నారు. వైసీపీ నిర్మించిన రుషికొండ ప్రభుత్వ భవనాలపై కూటమి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రుషికొండ ప్యాలెస్‌ను ప్రభుత్వ భవనంగా వినియోగించాలని డిమాండ్ చేశారు. ఆదాయం సమకూరడానికి బదులు నష్టం జరుగుతుంటే కనుక వేలం వేయడం సరైన చర్య అని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

### అన్నదాత పోస్టర్ రిలీజ్ చేసిన వైసీపీ

ఏపీలో రైతులకు యూరియా కొరతతో పాటు విత్తన కొరత లాంటి సమస్యలపై వైసీపీ పోరుబాట పట్టాలని నిర్ణయం తీసుకుంది. యూరియా కొరతతో పాటు రైతుల సమస్యలపై సెప్టెంబర్ 9వ తేదీన ఏపీలోని అన్ని ఆర్డీవో కార్యాలయాల ఎదుట శాంతియుత నిరసనలు చేయడానికి పార్టీ శ్రేణులకు వైసీపీ అధిష్టానం పిలుపునిచ్చింది.

ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నదాత పోరు పోస్టర్‌ను శనివారం (సెప్టెంబర్ 6న) విడుదల చేశారు. సాగు చేయడానికి రైతులు ఏర్పాటు పూర్తి చేసుకున్నా, యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని సజ్జల పేర్కొన్నారు. యూరియా అడుగుతుంటే రైతులను బొక్కలో తోస్తానంటూ సీఎం చంద్రబాబు అన్నదాతలను రైతులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఏపీలో ఉన్నది కూటమి పాలన కాదని, నియంతృత్వ పాలన అని ఎద్దేవా చేశారు. టీడీపీ సహా కూటమి నాయకులు రైతులకు అందాల్సిన యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి వ్యాపారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఏపీలో ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించి రైతులను భయాందోళనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

# ట్రంప్ దుందుడుకు చర్యలు

కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకు వెళుతున్నట్లు కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఐటీ ఉద్యోగుల భవిష్యత్తుకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు. అమెరికాలోని ట్రంప్ మద్దతుదారులు 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాదంతో అవుట్‌సోర్సింగ్‌కు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. దీనిపై ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశ్విని వైష్ణవ్ స్పందించారు. "భారత్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు), భారీ సేవా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బహుళజాతి సంస్థలతో మేం నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. అదే సమయంలో అమెరికా, యూరప్, జపాన్, ఆగ్నేయాసియా దేశాల ప్రభుత్వాలతోనూ చర్చిస్తున్నాం. అత్యున్నత నాణ్యతతో కూడిన ఉపాధిని అందిస్తున్న ఈ కీలక పరిశ్రమ చెక్కుచెదరకుండా, మరింత వృద్ధి చెందేలా చూడటమే మా లక్ష్యం" అని ఆయన వివరించారు.

ఇటీవల, ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో చేసిన వ్యాఖ్యలు ఈ ఆందోళనలకు మరింత ఆజ్యం పోశాయి. విదేశీ రిమోట్ వర్కర్లపై టారిఫ్‌లు (పన్నులు) విధించాలని, అమెరికాకు రిమోట్‌గా సేవలు అందించే దేశాలు కూడా వస్తువుల మాదిరిగానే పన్నులు చెల్లించాలని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఇది నేరుగా భారతదేశ విదేశీ మారకద్రవ్య ఆర్జనపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. భారత ఐటీ సేవల రంగంలో ప్రస్తుతం 56 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. దేశ ఎగుమతి ఆదాయంలో ఈ రంగం వాటా చాలా కీలకం. అయితే, కేవలం సేవల ఎగుమతులపైనే ఆధారపడకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను కూడా బలోపేతం చేస్తోందని మంత్రి వైష్ణవ్ తెలిపారు. "దేశీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని శక్తిమంతం చేస్తున్నాం. స్మార్ట్‌ఫోన్ల తయారీలో మన వాటా గణనీయంగా పెరిగింది.

ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన అన్ని పరికరాలను ఒక్కొక్కటిగా దేశంలోనే తయారు చేసేలా సరఫరా గొలుసును స్థానికీకరిస్తున్నాం" అని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉన్న ఐటీ ఉద్యోగాలను కాపాడుకుంటూనే, దేశంలోని నైపుణ్యం కలిగిన యువతకు తయారీ రంగంలో కొత్త అవకాశాలు సృష్టించడమే తమ ద్వంద్వ వ్యూహమని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ ఐటీ పరిశ్రమల సంస్థ నాస్కామ్ అంచనాల ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరంలో భారత టెక్నాలజీ రంగం 5.1 శాతం వృద్ధితో 282.6 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించనుంది. 2026 ఆర్థిక సంవత్సరం నాటికి ఇది 300 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటుతుందని అంచనా. ఈ రంగంలో కొత్తగా 1,26,000 ఉద్యోగాలు కూడా రానున్నాయని నాస్కామ్ తన నివేదికలో పేర్కొంది.

# స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేలా కార్యక్రమాలను చేప ట్టనున్నారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 10న కొత్తగూడెం, 11న భద్రాచలం నియోజకవర్గాల్లో కేటీఆర్ పర్యటించనున్నట్టుగా తెలుస్తోంది. సెప్టెంబర్ 13న గద్వాల నియోజకవర్గంలో జరిగే ర్యాలీ, బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొనున్నారు. దసరా లోపు వీలైనన్ని ఎక్కువ నియోజకవర్గాల్లో పర్యటించాలని కేటీఆర్ భావిస్తున్నారు. ఈ పర్యటనల ద్వారా పార్టీ క్యాడర్‌లో జోష్ తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టుగా తెలుస్తోంది.

ఇక, మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఎంపీ సంతోష్ రావులపై కవిత ఆరోపణలు చేయడం, ఆ తర్వాత ఆమెను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడం జరిగిన సంగతి తెలిసిందే. తనను సస్పెండ్ చేయడంపై ఘాటుగా స్పందించిన కవిత పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి సైతం రాజీనామా చేశారు. అయితే ఈ క్రమంలోనే కవిత తన ఆరోపణల తీవ్రతను మరింతగా పెంచారు. అయితే ఈ పరిణామాలపై బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలో గత కొద్దిరోజులు ఎర్రవల్లిలోనే ఉన్న కేటీఆర్ కేసీఆర్‌తో మంతనాలు జరుపుతున్నారు. లండన్ పర్యటన ముగించిన హైదరాబాద్ చేరుకున్న హరీష్ రావు కూడా శనివారం మధ్యాహ్నం ఎర్రవల్లి చేరుకుని కేసీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కేటీఆర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత చేసిన ఆరోపణలు, పార్టీలో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వంపై పోరాటంలో ఏ విధంగా ముందుకెళ్లాలి తదితర అంశాలపై చర్చించారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా వీరు చర్చించినట్టుగా సమాచారం.

## మనకు న్యాయం జరగాలంటే

# రాష్ట్రంలో ప్రభుత్వం మారాలేమో

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఆదివారం భూనిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి భూములు కోల్పోనున్న రైతులతో మాట్లాడారు. "నాకు జరిగిన అన్యాయాన్ని నేను తట్టుకున్నాను. కానీ ప్రజలకు అన్యాయం జరుగుతుంటే మాత్రం సైలెంట్‌గా ఉండలేను. అవసరమైతే ట్రిపుల్ ఆర్ రద్దయినా సరే, ఉత్తర భాగం భూనిర్వాసితుల హక్కులను కాపాడుతా" అని రైతులకు ఆయన భరోసా ఇచ్చారు.

### ప్రజల కోసం ఏ త్యాగానికైనా రెడీ

"మన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ ప్రశ్నించి, స్తంభింపజేయాలి. మునుగోడు ప్రజలే నాకు బలం, వారి కోసం ఎలాంటి పోరాటానికైనా, అవసరమైతే ఎంత త్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను.

అదే విధంగా ప్రజలు, రైతులు కూడా నాతో కలిసి పోరాటం చేయడానికి సిద్ధంగా ఉండాలి. నేను అధికార పార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేనైనా, ప్రజలకు అన్యాయం జరిగితే రాష్ట్ర ప్రభుత్వంతో పోరాటానికి మాత్రం వెనుకాడను. పదవుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరకు వెళ్లే మనిషిని కాను. నాకు నా ప్రాంత ప్రజలే ముఖ్యమని సీఎంకు చెబుతానని" ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

### మునుగోడు ప్రజలకే ఎక్కువ నష్టం

"నాపై ఉంచిన మీ నమ్మకాన్ని ఎన్నటికీ వమ్ము చేయను. రైతుకు, భూమికి మధ్య ఉన్న బంధం విడదీయలేనిది. భూమి అంటే కేవలం వ్యవసాయం కాదు.

అది మనకు దక్కే గౌరవం, ఒక స్టేటస్. ట్రిపుల్ ఆర్ లో భాగంగా చేస్తున్న పనులలో ఎక్కువ భూములు కోల్పోతున్నది మునుగోడు నియోజకవర్గ ప్రజలే. వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాను. అవసరమైతే కేంద్ర మంత్రులను కూడా కలుసుకుని మన సమస్యలు వారికి వివరిస్తాను. మీకు న్యాయం జరిగేవరకు బాధ్యతగల ఎమ్మెల్యేగా మీతో కలిసి పోరాడతా" అని వారికి రాజగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం జరిగిన ఈ సమావేశంలో నారాయణపురం మండలానికి చెందిన భూములు కోల్పోయిన రైతులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఇదివరకే మంత్రి పదవి విషయంపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వంలో సెగలు రేపుతున్నాయి. తాజాగా ట్రిపుల్ ఆర్ అలైన్ మెంట్ విషయాన్ని లేవనెత్తారు.

# థాంక్యూ ఒవైసీ భాయ్

ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఒవైసీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "జాతీయ ప్రయోజనాల దృష్ట్యా జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారికి మద్దతుగా ముందుకు వచ్చినందుకు అసదుద్దీన్ ఒవైసీ భాయ్‌కి ధన్యవాదాలు" అని రేవంత్ రెడ్డి తన పోస్టులో పేర్కొన్నారు. అంతకుముందు, ముఖ్యమంత్రి తనతో ఫోన్‌లో మాట్లాడి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వాలని కోరినట్లు ఒవైసీ వెల్లడించారు. హైదరాబాదీ అయిన సుదర్శన్ రెడ్డికి ఎంఐఎం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. తాను జస్టిస్ రెడ్డితో కూడా మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఒవైసీ పేర్కొన్నారు. వాస్తవానికి, ఎంఐఎం పార్టీ ఇండియా కూటమిలో భాగస్వామి కానప్పటికీ ఈ మద్దతు ప్రకటించడం గమనార్హం. మరోవైపు, "తెలుగు ఆత్మగౌరవం" నినాదంతో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని రాజకీయ పార్టీలను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అయితే, తెలంగాణలోని ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ ఇంకా ఏ అభ్యర్థికి మద్దతిచ్చేది ప్రకటించలేదు. రాష్ట్రానికి యూరియా కొరతను తీరుస్తామని హామీ ఇచ్చిన వారికే తమ మద్దతు ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గతంలో వ్యాఖ్యానించారు. రాజ్యసభలో బీఆర్ఎస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది. అధికార టీడీపీ, జనసేన పార్టీలు ఎన్డీయేలో భాగస్వాములు కావడంతో తమ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతు ప్రకటించాయి. అదేవిధంగా, ఏ కూటమిలోనూ లేని వైసీపీ కూడా ఎన్డీయే అభ్యర్థికే మద్దతు ఇస్తున్నట్లు తెలిపింది. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఆ పార్టీ ఎంపీ మిథున్ రెడ్డి, ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు మధ్యంతర బెయిల్ మీద శనివారం జైలు నుంచి విడుదలయ్యారు. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుండగా, తెలుగు రాష్ట్రాల్లోని పార్టీలు భిన్న వైఖరులతో ముందుకు సాగుతున్నాయి.

# మేడిగడ్డ బరాజ్ వద్ద పర్యాటకుల సందడి




మహదేవపూర్(కాళేశ్వరం) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్ పల్లి గ్రామంలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్ వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. బరాజ్ సందర్శన కోసం హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన పలువురు పర్యాటకులు తరలివచ్చారు. బరాజ్ అప్‌స్టీమ్, డౌన్‌స్టీమ్‌లను వీక్షించారు. కుటుంబ సభ్యులతో కలిసి బరాజ్‌పై సెల్ఫీ దిగి సంబురపడ్డారు. నాడు కేసీఆర్ ముందు చూపుతో తెలంగాణకు సాగు, తాగు అందించేందుకు నిర్మించిన అద్భుత ప్రాజెక్ట్ ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యానికి గురికావడం దారుణమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. బరాజ్‌ను వినియోగంలోకి తీసుకొస్తేనే రైతులు, ప్రజల ఇబ్బందులు తీరుతాయని అభిప్రాయపడ్డారు.

# పోటెత్తిన భారీ అలలు..

## తొలిసారి లాల్‌బగుచా రాజా నిమజ్జనం ఆలస్యం..!



గణేశ్ నవరాత్రులు ముగియడంతో దేశవ్యాప్తంగా నిమజ్జనాలు సంబురంగా జరిగాయి. అయితే.. ముంబైలోనే కాకుండా యావత్ భారతమంతా ప్రసిద్ధి చెందిన 'లాల్‌బగుచా రాజా' నిమజ్జనం మాత్రం ఆలస్యం అవుతోంది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 7 ఆదివారం ఉదయం 9 గంటలకు విగ్రహం గంగమ్మ ఒడికి చేరాలి. కానీ, సముద్రపు అలలు భారీగా వస్తుండడంతో లాల్‌బగుచా రాజాను తరలిస్తున్న పడవ నీటి మధ్యలో చిక్కుకపోయింది. దాంతో.. నిమజ్జన ప్రక్రియను నిలిపివేశారు. నవరాత్రుల తర్వాత ఈ వినాయకుడు గంగమ్మ ఒడికి ఆలస్యం కావడం చరిత్రలో ఇదే మొదటిసారి. శనివారం రాత్రి భక్తులు వీడ్కోలు పలుకగా లాల్‌బగుజా రాజాను నిమజ్జనానికి తరలించారు. దారుల వెంబడి భక్తుల నీరాజనాల మధ్య ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. ఆదివారం ఉదయం గిర్గావ్ చౌపట్టీ బీచ్ వద్దకు గణేశుడు చేరుకున్నాడు. అక్కడి నుంచి పెద్ద పడవ (ర్యాఫ్ట్)లో విగ్రహాన్ని ఎక్కించారు. అయితే.. అప్పటికే అలలు భారీ ఎత్తుతో వస్తున్నాయి. దాంతో.. లాల్‌బగుచా రాజా విగ్రహాన్ని తీసుకెళ్తున్న పడవ కొంతమేర నీట మునిగింది. 20 మంది వాలంటీర్లు, జాలరులు విగ్రహం ఉన్న తెప్ప అటూఇటూ జరగకుండా చూస్తున్నారు.

## చంద్రగ్రహణం సందర్భంగా తిరుమలలో

# శ్రీవారి ఆలయ ద్వారాలు మూసివేత



తిరుమల : చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ద్వారాలను సాంప్రదాయ బద్ధంగా మూసివేసినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు చెప్పారు. రాత్రి 9.50 గంటల నుంచి సోమవారం తెల్లవారుజామున 1.31 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం శాస్త్రోక్తంగా శుద్ధి తదితర కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం ఉదయం 3 గంటలకు మళ్లీ శ్రీవారి ఆలయ ద్వారాలు తెరిచి భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు వివరించారు. అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లో వేచి ఉన్న భక్తులందరికీ నిర్దేశిత సమయానికి అనుగుణంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం ఏర్పాట్లు కల్పించామని వివరించారు. చంద్రగ్రహణం కారణంగా అన్నప్రసాదం కాంప్లెక్స్, వకుళమాత, పిఏసి-2, వైకుంఠం వంటశాలలు మూసి వేసినట్లు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్నప్రసాద విభాగం భక్తుల కొరకు 50 వేల పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేసిందన్నారు. అన్నప్రసాద వితరణ సోమవారం ఉదయం 8 గంటల నుంచి పునః ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల ఆలయ అర్చకులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, అన్నప్రసాదం డిప్యూటీ ఈవో రాజేంద్ర, వీజీవో సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ల పెంపును తక్షణం అమలు చేయాలి

**- స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం**

**వెల్లిమెల్ల ప్రమోద్ మాదిగ ఆధ్వర్యంలో చల్లో కొల్లూరు**

**మహా గర్జన'లో మంద కృష్ణ మాదిగ హెచ్చరిక**







శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్) ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగా పింఛన్ల పెంపును తక్షణం అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. కొల్లూరులోని బీఆర్జీ ఫంక్షన్ హాల్లో 'చల్లో కొల్లూరు – మహా గర్జన' పేరుతో ప్రజాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్దులు, వితంతువులు, నిరాశ్రయ మహిళలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 21 నెలలు పూర్తయ్యాయన్నారు. ఆయన విజయం కుటుంబం, సామాజిక వర్గం వేసిన ఓట్లు కారణం కాదన్నారు. 55 లక్షల పేద ప్రజలు పింఛన్ పై నమ్మకంతో వేసిన ఓట్లే ఆయన గెలుపునకు కారణమన్నారు. ఎన్నికల ముందు 45 లక్షల మంది పింఛన్దారులు ఉన్నారన్నారు. అప్పటి నుంచి మరో 10 లక్షల మంది అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో దివ్యాంగులకు రూ. 6,000, వృద్దులు, వితంతువులు, నిరాశ్రయ మహిళలు, ఒంటరి మహిళలు రూ. 4,000 పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం నుంచి పెండింగ్లో ఉన్న 10 లక్షల మంది దరఖాస్తుదారులకు కూడా ఈ పరిహారం వర్తిస్తుందని, డిసెంబర్ 9, 2023 నుంచి ఆ డబ్బును నేరుగా పింఛన్దారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని రేవంత్ రెడ్డి స్వయంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఇంత కాలం అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో గానీ, వెలుపల గానీ ప్రతిపక్ష పార్టీలు, నాయకులు మాట్లాడకపోవడం శోచనీయం అన్నారు. తమ మేనిఫెస్టోలో కూడా రూ. 6,000 పింఛన్ హామీ ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ కూడా దీనిపై ఒత్తిడి చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వానికి తమ వాగ్దానాలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతిపక్షాలకు ప్రశ్నించే హక్కు ఉందని పేర్కొన్నారు అయినా, అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం రెండూ తమ బాధ్యతలలో విఫలమయ్యాయన్నారు. రేవంత్ రెడ్డి పింఛన్లు పెంచలేదన్నారు. కేసీఆర్ డిమాండ్ చేయడం లేదన్నారు. సోనియా గాంధీ పుట్టిన రోజున పెంచిన పింఛన్లు జమ చేస్తామని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఓట్లు గెలవడానికి చేసిన రాజకీయ స్టంట్ తప్ప మరేమీ కాదన్నారు. తనను నమ్మి ఆశలు పెట్టుకున్న 55 లక్షల మందికి ద్రోహం చేసినట్టేనన్నారు. ఇది పేద కుటుంబాల నుంచి వచ్చిన పింఛన్దారుల పోరాటం అన్నారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ ఇద్దరికి ఈ బాధ తెలియడం లేదన్నారు. పింఛన్ పై ఆధారపడిన కుటుంబం నుంచి వచ్చిన వాడిని కాబట్టి ఈ బాధను అర్థం చేసుకున్నానన్నారు. అందుకే జూలై 15 నుంచి తెలంగాణాలోని గ్రామగ్రామాన పర్యటిస్తున్నానని తెలిపారు. ఇకపై ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో ధర్నా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ – విజయవాడ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కొల్లూరు గ్రామ అధ్యక్షులు వై ప్రమోద మాదిగ మాట్లాడుతూ చిన్నారుల గుండె సమస్యలపై పోరాటం చేసిన మహానుభావుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. పింఛన్ పెంపును ఇక ఎంత మాత్రం ఉపేక్షించడానికి వీల్లేదన్నారు. ఈ మహా గర్జనలో తెలంగాణ నుంచి భారీగా ప్రజలు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ ఇన్చార్జ్ వీఎస్ రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి

**- వేద కుమార్**




రాయపోల్ : జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని బాల చెలిమి, చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ వేద కుమార్ అన్నారు. ఆదివారం సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం అనాజీపూర్ ఉన్నత పాఠశాలలో బాల చెలిమి ఆధ్వర్యంలో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేద కుమార్ మాట్లాడుతూ.. బాలల వికాసానికి పుస్తకాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధి శ్యాంసుందర్ రావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మైలార్దేవ్పల్లిలో భారీ అగ్నిప్రమాదం.

# ఎగిసిపడ్డ అగ్నికీలలు




హైదరాబాద్ : నగర పరిధిలోని మైలార్దేవ్పల్లిలో ఆదివారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. టాటానగర్లో ఉన్న ఓ పరిశ్రమలో మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు కలిసి ఎగిసిపడుతున్న మంటలను అదుపు చేశారు. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## లక్ష్మీపూర్లో ఘనంగా

# బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ

**- దళితులకు అండగా ఉంటాం**

**- ఎస్సీ,ఎస్టీ కమీషన్ చైర్మన్ : బక్కి వేంకటేశ్వర్లు**

**- సమాన హక్కులకోసం జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం స్ఫూర్తి దాయకం**

**- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం**







రామడుగు /బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం,రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వేంకటేశ్వర్లు, చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం, తెలంగాణ తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశ స్వాతంత్ర ఉద్యమంలోనే కాకుండా బడుగు బలహీన వర్గాల కృషి కోసం పోరాడిన మహోన్నత నాయకుడని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో యువత, విద్యార్థులు నడవాలని సూచించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఎల్లప్పుడూ వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. రామడుగు మండల పరిధిలో దళితులకు ఏవైనా సమస్యలు ఉంటే ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితోనే సమాన హక్కుల కోసం అనేక చట్టాలు వచ్చాయని, సమాన హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తి దాయకమన్నారు. డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ సమాజంలో సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, కరీంనగర్ బార్ అసోసియేషన్ లింగంపల్లి నాగరాజు, మాజీ వైస్ ప్రెసిడెంట్ రఘువీర్, దళిత విద్యార్థి సంఘ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కనకం వంశీ కిరణ్, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్, ఎస్సీ ఎస్టీ సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు తడగొండ సత్యరాజ్ వర్మ, ఏఐఎస్బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్తో పాటు దళిత సంఘాలు, యువజన సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జంపన్నవాగులో ఈతకు వెళ్లి యువకుడి మృతి



తాడ్వాయి, సెప్టెంబర్7 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని జంపన్నవాగులోకి ఈతకు వెళ్లి కానుగంటి మనీశ్ (23) అనే యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు, మృతుడి స్నేహితుల కథనం ప్రకారం.. జనగామ జిల్లాకు చెందిన మనీశ్ తన స్నేహితులతో కలిసి మేడారం సమ్మక్కసారలమ్మ దర్శనానికి వచ్చారు. మొక్కులు చెల్లించుకున్న అనంతరం స్నేహితులతో కలిసి జంపన్నవాగులో ఈతకు వెళ్లారు.
అందరూ వాగులోకి దిగగా మనీశ్ లోతు ఎక్కువ ఉన్న ప్రాంతానికి వెళ్లి అందులో మునిగి గల్లంతయ్యాడు. గమనించిన స్నేహితులు మనీశ్ కోసం గాలించగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు, ఆర్డీఎఫ్ బృందానికి సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఆర్డీఎఫ్ బృందం మనీశ్ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసింది. మనీష్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

# కేంద్ర ప్రభుత్వ విధానాలతో పత్తి రైతులకు తీరని నష్టం

**- బండారి రవికుమార్**




ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశంలో పత్తి రైతులకు తీరని నష్టం వాటిల్లే అవకావముందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారి రవికుమార్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కుశాన రాజన్న అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంటపై ఉన్న 11 శాతం టారిఫ్ను సున్నాకు తేవడంతో దేశంలోని పత్తి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అమెరికా లాంటి దేశాల నుంచి వచ్చే పదివేల కోట్ల పత్తి దేశానికి చేరే ప్రమాదం ఉందని, దీనితో దేశంలోని రైతుల పంట ధర తగ్గుతుందన్నారు. పెట్టుబడి దారి దేశాలకు సహకరించే విధంగా నరేంద్ర మోదీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అమెరికాకు సహకరించే విధానంలో భాగంగా దేశ రైతులను దెబ్బతీసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రైతులతో పాటు, జిన్నింగ్ మిల్లుల యజమానులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దేశంలో యూరియా కొరత సృష్టిస్తున్నారని అన్నారు. రైతులకు యూరియా పంపిణీపై నిర్దిష్ట విధానం లేకపోవడమే కొరతకు కారణమన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు పీఆర్సీ కోసం చేస్తున్న ఉద్యమానికి మద్దతు పలకనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల కార్యదర్శులు సంకె రవి, దర్శనాల మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు దుర్గం దినకర్, కార్తీక్, రాజేందర్, ఆనంద్, టీకానంద్ పాల్గొన్నారు.

## తెలంగాణ హోం మంత్రి గాఢ నిద్రలో ఉన్నారా..?

## సీఎం రేవంత్ను సూటిగా ప్రశ్నించిన ఆర్ఎస్పీ




హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మరోసారి నిప్పులు చెరిగారు. హైదరాబాద్లో డ్రగ్స్ ఫ్యాక్టరీని ముంబై పోలీసులు సీజ్ చేసిన ఘటనపై ఆర్ఎస్పీ స్పందించారు. తెలంగాణ సీఎం, హోంమంత్రి గాఢ నిద్రలో ఉన్నారా? అవును ఆయన నిజంగానే గాఢ నిద్రలో ఉన్నారని ఆర్ఎస్పీ ధ్వజమెత్తారు. హైదరాబాద్ చర్లపల్లిలో మహారాష్ట్ర పోలీసులు నెలరోజులు నిఘా పెట్టి, రూ. 12 వేల కోట్ల విలువైన నిషేధిత డ్రగ్స్ తయారు చేస్తున్న సీక్రెట్ ఫ్యాక్టరీ గుట్టురట్టు చేసేదాక, తెలంగాణ రాష్ట్ర హోం మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ పోలీసులకు తెలవదంటే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఎంత అధ్వాన్నంగా తయారైందో ఊహించుకోవచ్చు అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. డ్రగ్స్ మాఫియాలో మీ కాంగ్రెస్ నాయకుల హస్తం ఉండకపోతే ఇన్ని రోజులు ఈ దందా నిరంతరాయంగా ఎట్ల జరుగుతది? ఇట్లాంటి దేశ, అంతర్జాతీయంగా డ్రగ్స్ సరఫరా జరుగుతుంటే, మీరేమో ప్రతిపక్ష నాయకుల మీద ఫేక్ కేసులు పెట్టే పనిలో ఉన్నారు? నిజంగా మీకు చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణ మరో పంజాబ్గా మారకముందే, రాజీనామా చేసి పదవి నుండి తప్పుకోండి అని రేవంత్కు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు.

# కుల సంఘ భవనాలు ఆత్మగౌరవ ప్రతీకలు

**- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**

**-వేములవాడ పట్టణంలో 43 కుల సంఘాలకు రూ.2.58 కోట్లు నిధులు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) కుల సంఘ భవనాలు ఆత్మగౌరవ ప్రతీకలుగా నిలుస్తాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన, కుల సంఘ భవనాలు పలు సామాజిక సమస్యల పరిష్కారానికి, కమ్యూనిటీ ఐక్యతకు వేదికలుగా మారతాయని తెలిపారు. ఆరు నెలల క్రితం వేములవాడ పట్టణ పరిధిలోని 43 కుల సంఘాలకు రూ. 1.26 కోట్లు మంజూరు చేశామని, తాజాగా మరో విడతలో రూ. 1.32 కోట్లు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన వెల్లడించారు. ఈ రెండు విడతల్లో కలిపి రూ. 2.58 కోట్లు నిధులు కేటాయించబడ్డాయని తెలిపారు. "ఈ భవనాల ద్వారా వివాహాలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు సులభంగా నిర్వహించుకునే సౌకర్యం కలుగుతుంది" అని ఆది శ్రీనివాస్ తెలిపారు. రానున్న రోజుల్లో వేములవాడ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## పవిత్రోత్సవాలు చివరి రోజు సందర్భంగా
# యాగశాలలో పూర్ణాహుతి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నందు పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. పవిత్రోత్సవాలు చివరి రోజు సందర్భంగా యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం అనంతరం కలిశాలను ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించి శ్రీ జ్ఞాన ప్రసూనాంబా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారికి యాగశాలలోని కలిశారు సన్నిధానానికి చేరుకున్నాయి.శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం పవిత్రోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయ పరివార దేవతలకు పవిత్రాలు సమర్పణ ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి టి బాపిరెడ్డి దంపతులు, డిప్యూటీఈవో ఎన్.ఆర్ కృష్ణారెడ్డి దంపతులు, సూపర్డెంట్ నాగభూషణం యాదవ్,టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శన్ మరియు దేవస్థానం వేద పండితులు పౌరోహితులు ఆర్చకులు ఆలయ అధికారులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పోలీస్ రాజ్యం నడుస్తుంది

**- ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి**




సూర్యాపేట : తెలంగాణలో పోలీస్ రాజ్యం నడుస్తుంది. మంత్రులకు పాలన చేతకాక పోలీసులను ముందుపెడున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేటలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ప్రజలనుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోలీసులను అడ్డుపెట్టుకొని పాలన సాగిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా పైన అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.యూరియా లైన్ వీడియో తీసి పెట్టినా.. కేసులు పెట్టడం దుర్మార్గం అన్నారు. అర్ధం లేని కేసులో అర్ధరాత్రి అరెస్టులు అక్రమం. ఓ తాగుబోతు ఇచ్చిన పిర్యాదుతో మాపార్టీ సీనియర్ నాయకున్ని అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజల ఒత్తిడితోనే ఈరోజు పోలీసులు తలొగ్గింద్రు. చట్టవిరుద్ధంగా పోలీసులు నడుచుకోవద్దని హితవు పలికారు. ఇలాంటి ఉద్యమాలు కేవలం కార్యకర్తలను విడిపించుకోవడం కోసమే కాదు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీల్లో మీరు చేస్తున్న మోసాలు ఒకటొకటిగా ఎండగడతామన్నారు. కేసులు మాకు కొత్త కావు..ప్రజా ఉద్యమాలు మొదలైతే.. పోలీసులు కూడా మిమ్మల్ని కాపాడలేరన్నారు. ప్రజల అండ ఉన్నంతవరకు ఇటువంటి కేసులు భయపెట్టలేవని పేర్కొన్నారు. సూర్యాపేట, నల్లగొండ ఎస్పీలకు మరోమారు చెబుతున్న.. లా అండ్ ఆర్డర్ అదుపుతప్పొద్దు. పోలీస్ అధికారులను చట్ట ప్రకారం పని చేసేటట్టు చూసుకోవాలన్నారు. ఒకపక్క గంజాయి మూకలతో సమాజం తప్పుదోవ పడుతుంది. ముందు వాటిపై దృష్టి పెట్టండి. ఈ అక్రమ కేసులపై పెట్టే శ్రద్ధ యూరియా ఇవ్వడంపై పెడితే బాగుంటుందన్నారు.

## చంద్రగ్రహణం ఎఫెక్ట్.. ఒంటి గంటకే
# శ్రీశైలం ఆలయం మూసివేసిన అధికారులు

చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత శ్రీశైలం ఆలయాన్ని మూసివేశారు. చంద్ర గ్రహణం ఇవాళ రాత్రి 9.56 గంటలకు ప్రారంభమై రాత్రి 1.26 గంటలకు ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఇవాళ మధ్యాహ్నం వరకు భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించారు. స్పర్శ దర్శనం పూర్తిగా నిలిపివేశారు.శ్రీశైలం ఆలయంలోని అన్ని ఆర్జిత సేవలు, పరోక్ష సేవలు, శ్రీస్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం పూర్తిగా నిలిపివేశారు. సాక్షి గణపతి, హాటకేశ్వరం, పాలధార పంచధార, శిఖరేశ్వరం మొదలైన పరివార ఆలయాల ద్వారాలను కూడా మూసివేశారు. రేపు అనగా సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయ ద్వారాలను తెరచి ఆలయ శుద్ధి, సంప్రోక్షణ జరిపించిన తర్వాత శ్రీస్వామి అమ్మవార్లకు ప్రాతఃకాల పూజలు జరిపిస్తారు. ఉదయం 7.30 గంటల నుంచి స్వామి అమ్మవార్లకు మహా మంగళహారతులను జరిపిస్తారు. మహా మంగళహారతుల సమయం నుంచి అనగా, ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.15 గంటల వరకు భక్తులందరికీ అలంకార దర్శనం కల్పిస్తారు.సెప్టెంబరు 8 వ తేదీ నాటికి ఆన్‌లైన్‌లో శ్రీస్వామివారి స్పర్శదర్శనం, విరామదర్శనం టికెట్లు పొందిన భక్తులకు మధ్యాహ్నం 2.15 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీస్వామివారి స్పర్శదర్శనం కల్పిస్తారు. తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి 9 గంటల వరకు అలంకార దర్శనాలు కొనసాగుతాయి. ఆన్‌లైన్ ద్వారా శ్రీస్వామివారి స్పర్శదర్శనం, విరామ దర్శనం టికెట్లు పొందిన భక్తులకు రాత్రి 9 గంటల నుంచి స్పర్శ దర్శనాలు కల్పిస్తారు. కాగా, ఆలయాన్ని మూసివేసిన కార్యక్రమంలో ఈవో ఎం.శ్రీనివాసరావు, శ్రీస్వామివారి ప్రధానార్చకులు శివప్రసాద్ స్వామి, పలువురు అర్చకస్వాములు, వేదపండితులు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎం.హరిదాసు, స్వామివారి ఆలయ పర్యవేక్షకులు ఎం.రవికుమార్, అమ్మవారి ఆలయ పర్యవేక్షకులు జి.రవి, ముఖ్య భద్రతాధికారి బి.శ్రీనివాసరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# మంచిర్యాల,గురువుల గోడు వినేదెవరు?

## ఎమ్మెల్యేలారా.. కలిసే అవకాశం ఇవ్వండి

**- గురుదక్షిణ- ఎంపీటీఎల్ అధ్యక్షులు విజయ్ కుమార్ నారమళ్ళ**

**మంచిర్యాల జిల్లా ఎమ్మెల్యేలారా?**
**మూడు నియోజకవర్గాల్లోని ఎలక్షన్స్ లో**
**మీ కోసం చాలా కష్టపడ్డాం**
**మీ గెలుపులో కీలక పాత్ర పోషించాం**
**గురువుల పట్ల బీఆర్ఎస్ నాయకుల నిర్లక్ష్యం చూసి**
**సోషల్ మీడియా ద్వారా మా సంఘం నాయకులం**
**ప్రచారం చేసి, గెలిపించుకున్నాం**
**మీరు మాత్రం మాకు సమయం ఇవ్వట్లేదు**
**మా బాధ చెప్పుకోనికి వస్తే**
**ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండట్లేదు**
**మీ పిఏలకు చెప్పి అపాయింట్మెంట్ ఇప్పించండి**

మంథని ( ప్రశ్న న్యూస్) తమ గెలుపులో కీలక పాత్ర పోషించిన గురువుల పట్ల జిల్లాలోని కొత్త ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం చూపుతున్నారని మంచిర్యాల ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ (గురుదక్షిణ) అధ్యక్షుడు విజయ్ కుమార్ నారమళ్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల వేధింపులు, అణచివేత భరించలేకపోయిన గురువులు, ఉద్యోగాలు పోయినా పర్వాలేదని కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారని, కానీ ఇప్పుడు తాము ఎదుర్కొంటున్న సమస్యలు చెప్పేందుకు ఎమ్మెల్యేల అపాయింట్‌మెంట్ కూడా దొరకడం లేదని ఆయన వాపోయారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రేమ్ సాగర్, వివేక్, వినోద్ గెలుపు కోసం తమ సంఘం నాయకులు, సభ్యులు సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం చేసి, విజయంలో ముఖ్య భూమిక పోషించామని విజయ్ కుమార్ గుర్తుచేశారు. "గత బీఆర్ఎస్ నాయకులు యాజమాన్యాలకు అండగా నిలిచి, మమ్ములను ఇబ్బంది పెట్టారు. దీంతో కాంగ్రెస్ గెలిస్తే మా సమస్యలు తీరుతాయని, యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటారని ఆశించాం" అని ఆయన వివరించారు.

### అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూపులు

ఎన్నికలకు ముందు తమ సమస్యలపై వివేక్ వెంకటస్వామి, ప్రేమ్ సాగర్ రావు స్పందించి, మద్దతుగా నిలిచారని విజయ్ కుమార్ తెలిపారు. కరోనా సమయంలో దాదాపు వంద మంది గురువులకు ప్రేమ్ సాగర్ నిత్యావసరాలు అందించారని, అలాగే ఎలాంటి పదవిలో లేనప్పటికీ వివేక్ వెంకటస్వామి గోదావరిఖనిలోని తన నివాసంలో గురుదక్షిణ సొసైటీ సభ్యులతో మాట్లాడి, తమ సమస్యలపై మీడియా వేదికగా అప్పటి ప్రభుత్వాన్ని ప్రశ్నించారని గుర్తు చేసుకున్నారు. "అప్పుడు పదవులు లేకపోయినా మా గోడు విన్నారు, కానీ ఇప్పుడు ఎమ్మెల్యేలు, ఒకరు మంత్రిగా, ఇంకొకరి కుమారుడు ఎంపీగా ఉన్నప్పటికీ, మాకు సమయం ఇవ్వలేకపోతున్నారు" అని ఆవేదనగా పేర్కొన్నారు.

### వేధింపులు ఇంకా కొనసాగుతున్నాయి

గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నాయకుల అండతో



గురువులను ఇబ్బంది పెట్టిన ప్రైవేట్ యాజమాన్యాలు ఇంకా వేధింపులకు పాల్పడుతూనే ఉన్నాయని విజయ్ కుమార్ వెల్లడించారు. తాము ఎమ్మెల్యేలను కలిసి తమ బాధ చెప్పుకోవాలని ప్రయత్నిస్తే, వారు అందుబాటులో ఉండటం లేదని, వారి పీఏల ద్వారా కూడా అపాయింట్‌మెంట్ దొరకడం లేదని ఆరోపించారు.

### మంత్రులకు, ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి

"మీరందరూ తలుచుకుంటే మా సమస్యలు క్షణాల్లో పరిష్కారమవుతాయి. గత టీఆర్ఎస్ ఎమ్మెల్యేల మాదిరిగా మీరు కూడా మమ్ములను పట్టించుకోకుండా వదిలేసి బాధపెట్టకండి" అని విజయ్ కుమార్ నారమళ్ల విజ్ఞప్తి చేశారు. మంచిర్యాల ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులను వెంటనే కలిసే అవకాశం కల్పించాలని ఆయన ఎమ్మెల్యేలకు, మంత్రులకు విన్నవించారు. గురువుల సమస్యలపై చర్చించి, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో
# చంద్రగ్రహణం సందర్భంగా ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం రాత్రి 9 గంటల 50 నిమిషాలకు ప్రారంభమై రాత్రి 1:20 నిమిషాల వరకు ఉంటుందని అర్ధగిరి స్వామి తెలిపారు. ఈ గ్రహణ కాల సమయంలో భారతదేశంలోని అన్ని దేవాలయాలు మూసివేస్తారని ఆయన తెలిపారు. ఒక్క శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాత్రం ఆ సమయంలో తెరిచి ఉంచి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు విశేష అలంకరణ నిర్వహిస్తారని ఆయన తెలిపారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని మూగజీవాలైనటువంటి శ్రీ అంటే సాలిపురుగు, కాలా అంటే నాగుపాము, హస్తి అనగా ఏనుగు ఈమూడు అత్యంత భక్తిపార్వస్యంతో పూజ చేసి శివునిలో ఐక్యమయ్యాయి అన్నారు. ఈ కాళహస్తీశ్వర క్షేత్రంలో స్వామివారికి తలం మీద ఐదు తలల సర్పము ఉంటుంది. జ్ఞానాన్ని ప్రసాదించే తల్లి జ్ఞాన ప్రసూనాంబికా దేవి అమ్మవారికి నడుము వద్ద ఒక సర్పం ఉంటుంది. కావున ఈ గ్రహణకాల సమయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయి. ఈ క్షేత్రం రాహుకేతు క్షేత్రంగా విరాజిల్లుతుంది. ఆ సమయంలో స్వామి అమ్మవాలను దర్శించుకుంటే స్వామి అమ్మవార్లు కృపకు పాత్రులు అవుతారని ఈ సందర్భంగా తెలియజేశారు.గ్రహణ గండాలకు అతీతం ఈ దివ్య క్షేత్రం శ్రీకాళహస్తిలో గ్రహణ సమయంలోనే ప్రత్యేక పూజలు.గ్రహణాల సమయంలో అన్ని ఆలయాలు మూసివేయడం సర్వసాధారణం అయితే తిరుపతి జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన శ్రీకాళహస్తీశ్వరుడి ఆలయంలో మాత్రం పూజలు జరుగుతూనే ఉంటాయి. గ్రహణ గండాలకు అతీత క్షేత్రంగా ఉన్న ఆలయంలో స్వయంభుగా వెలిసిన మహాలింగానికి 9 గ్రహాలు, 27 నక్షత్రాలతో అలంకార కవచం ఉండమే ప్రత్యేకం. ఆ ఆలయం గ్రహణ గండాలకు అతీతం. దోష నివారణలో భక్తుల ఆదరణ పొందిన క్షేత్రం. గ్రహణ కాల సమయంలో గ్రహణ శాంతి అభిషేకాలు జరిగే ఆలయం. రాహు కేతు సర్ప దోష నివారణ క్షేత్రంగా విరాజుల్లుతున్న ఆలయం. గ్రహణ కాలంలో భక్తులకు స్వామి వారి దర్శనం అందుబాటులో ఉండటం ఇక్కడ ప్రత్యేకం. ఆ ఆలయం గ్రహణ గండాలకు అతీతం. దోష నివారణలో భక్తుల ఆదరణ పొందిన క్షేత్రం. గ్రహణ కాల సమయంలో గ్రహణ శాంతి అభిషేకాలు జరిగే ఆలయం. రాహు కేతు సర్ప దోష నివారణ క్షేత్రంగా విరాజుల్లుతున్న. గ్రహణాల సమయంలో అన్ని ఆలయాలు మూసివేయడం సర్వసాధారణం. ఈ ఆలయం గ్రహణ గండాలకు అతీతం. శ్రీకాళహస్తి క్షేత్రం శ్రీకాళహస్తీశ్వరుడి మహాలింగం 9 గ్రహాలు 27 నక్షత్రాలతో అలంకార కవచం ఉండడం ప్రత్యేకం.రాహు-కేతు,సర్ప దోష నివారణ క్షేత్రంలో అమ్మవారి నడుముకు నాగాభరణం అలంకారంగా ఉండడంతో దోష నివారణ క్షేత్రంగా భక్తులను ఆకట్టుకుంటోంది. స్వయంభుగా వెలిసిన వాయు లింగేశ్వరుడి ఆలయం గ్రహణ కాలంలో మూతపడని ఆలయంగా ప్రసిద్ధి చెందింది. గ్రహణ కాల సమయంలో అన్ని ఆలయాలకు భిన్నంగా తెరిచి ఉండడం. ఆలయంలో దాదాపు 5 దశాబ్దాల క్రితం రాహు, కేతు సర్పదోష నివారణ పూజలు ప్రారంభమయ్యాయి. ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందింది గతంలో రోజు వారి దీపాలు వెలిగించేందుకు కష్టాలున్న పరిస్థితుల్లో ఈ పూజలతో రాష్ట్ర దేవా దాయ శాఖ పరిధిలోని 11 ప్రముఖ ఆలయాల్లో ముందు వరుసలో స్థానం సంపాదించింది.అన్ని వర్గాలకు అందుబాటులో రాహు కేతు పూజలు ఉండేలా రూ.500, రూ. 750, రూ.1500, రూ.2500, రూ.5 వేల టికెట్లతో పూజలు అందుబాటులోకి తెచ్చిన దేవస్థానం ప్రస్తుతం ఏటా రూ. 200 కోట్ల మేర ఆదాయం వస్తుందంటే అందులో ప్రధాన భూమిక రాహు, కేతు పూజలదే. పూజా మండపంలో రాహు, కేతు సర్ప రూపాలు, మహాలింగం ముందు తొమ్మిది గ్రహాలు, 27 నక్షత్రాలతో అలంకార కవచం ఏర్పాటు చేయడం, అమ్మవారి నడుముకు నాగాభరణం అలంకారంగా ఉండటంతో శ్రీకాళహస్తి క్షేత్రం సర్పదోష నివారణలకు ప్రముఖ క్షేత్రంగా పేరు



సంపాదించింది.జాతక చక్రంలో ఈ రెండు గ్రహాల కారణంగా అనేక సమస్యలు తలెత్తుతుండగా గ్రహస్థితి మెరుగు పడేందుకు వీలుగా ఇక్కడ నిర్వహించే పూజలకు విశేష ఆదరణ పెరుగుతోంది. ఏటా దాదాపు పది లక్షలకు పైగా రాహు కేతు పూజలు జరుగుతుండటం మరో విశేషం. దోష నివారణ పూజలకు విదేశీ ఆదరణ కూడా లభిస్తుండగా అన్ని ఆలయాలు గ్రహణకాల సమయానికి ఆరు గంటల ముందే మూసి వస్తుండగా చంద్రగ్రహణం రోజున శ్రీకాళహస్తి ఆలయం మాత్రం యధావిధిగా భక్తులకు దర్శన సౌకర్యం కల్పిస్తోంది.

# సీజనల్ వ్యాధులు తస్మాత్ జాగ్రత్త

## ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాసరెడ్డి

**-జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ నీలారపు శ్రీనివాస్**

జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్) వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విషజ్వరాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐఎంఏ జగిత్యాల శాఖ ప్రధాన కార్యదర్శి డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలో ఐఎంఏ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో "ఆవో గావ్ ఛలో" కార్యక్రమం నిర్వహించడం జరిగింది.సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయడానికి అవగాహన కరపత్రాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించడం జరిగింది. వర్షాకాలంలో దోమల ద్వారా వచ్చే వ్యాధులు ప్రబలకుండా మనమందరం జాగ్రత్త తీసుకోవాలన్నారు. నీటిని నిలువ చేయడం ద్వారా, ఇంటి చుట్టుపక్కల చెత్త పేరుకపోవడం ద్వారా దోమలు తయారవుతాయని కాబట్టి మన పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి రోజు డ్రై డే గా నీరు నిలవకుండా చూసుకోవాలని తెలిపారు. మురికి నీటి ప్రాంతాల్లో ఆడ ఎడిస్ దోమ కారణంగా డెంగ్యూ వ్యాధి ప్రభలే ఆస్కారం ఉంది, కావున దోమలను నివారించడానికి కావలసిన చర్యలను చేపట్టాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వపరంగా ఆరోగ్య కార్యకర్తలు ఎప్పటికప్పుడు జ్వర పరిస్థితులను అంచనా వేస్తూ ప్రజలకు మందులను అందుబాటులో ఉంచుతున్నామని డిప్యూటీ డిఎం హెచ్ ఓ డాక్టర్ నీలారపు శ్రీనివాస్ తెలిపారు.





విష జ్వరాలు రాకుండా ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాన్ని అందిస్తూ ఆరోగ్య పరిస్థితులపై సర్వే నిర్వహించి, నిలువ ఉన్న కలుషిత నీటిని పారేయడం జరిగింది. బురద నీటిలో లార్వాని రసాయనాల ద్వారా నాశనం చేశారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ కోశాధికారి డా.కోటగిరి సుధీర్ కుమార్, డా. కొంతం ప్రవీణ్ కుమార్, డా.సౌజన్య గ్రామ ప్రముఖులు నక్క రవీందర్ రెడ్డి, మెడికల్ సూపర్వైజర్ శోభారాణి, నవ్య హెచ్ఇఓ శ్రీధర్, ఏఎన్ఎం ఆశ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మాల మహానాడు మంథని నియోజకవర్గం ఇంచార్జీ గా కందుగుల రాజన్న నియామకం



మంథని( ప్రశ్న న్యూస్) జాతీయ మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అద్దంకి దయాకర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో కాటారం మండలంకు చెందిన కందుగుల రాజన్న ను మంథని నియోజకవర్గం ఇంచార్జీ గా ప్రకటించడం జరిగినది. నూతనంగా నియమితులైన రాజన్నకు మంథని పట్టణంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ మాల మహానాడు కమ్యూనిటి హాల్ లో రాష్ట్ర ఉపాధ్యక్షులు నూకల బాణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కందుగుల రాజన్న మాట్లాడుతూ... ఈ నెల 8 సోమవారం రోజున మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాల సామాజిక వర్గానికి జరిగిన రోస్టర్ విధానం రద్దు చేయాలని వినతి పత్రం అందజేయడం జరుగుతుందని అన్నారు. త్వరలో జాతీయ మాల మహానాడు నియోజకవర్గం, డివిజన్, మండల కమిటిలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు అప్పాల పోచమల్లయ్య, టీం అధ్యక్షులు నూకల శంకర్, మండల అధ్యక్షులు జంజర్ల రాజు, ఎరుకల ప్రవీణ్, బండి రాజయ్య, కొవ్వూరి రాజలింగు, కొవ్వూరి వేణు ప్రసాద్, పసుల పోచయ్య, బొడ్డేల్లా రవి, ఆర్ల జ్ఞాని, డికొండ లక్ష్మణ్, జంజర్ల శ్రీనివాస్, ఆర్ల సందీప్, లింగాల సురేష్, నవ రమేష్, రావుల మొగిలి, వెంకటేష్ లు పాల్గొన్నారు.

# హెూమాలకు పరిమితమైన మంత్రి...

**రైతులు కష్టాల్లో ఉన్న పట్టించుకొని మంథని ఎమ్మెల్యే.**

**కనీసం పంట పొలాలను పత్తి చేనులను పర్యవేక్షణ చెయ్యలేదు.**

**చుట్టం చూపుల మంథనికి రాక..**

**రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలని వేడుకోలు...**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని నియోజకవర్గం లో మంత్రి శ్రీధర్ బాబు కేవలం హెూమాలు ,యాగాల కొరకు మంథనికి వస్తున్నాడని ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు, ప్రతి పక్ష పార్టీలు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలతో గోదావరి పరివాహక ప్రాంతాల్లో పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు.మంత్రి మంథనికీ వచ్చి హెూమాలు చేసి గణపతి మండపాలు తిరిగి పరామర్శలు చేసి వెళ్ళాయాడు.కానీ పక్కన ఉన్న పోతారము,విలోచవరం, మంథని గ్రామాల రైతుల మాత్రం పంట పొలాలను పర్యవేక్షించలేదు. రైతుల బాధలు అడిగి తెలుసుకోలేదు. దీంతో రైతులు కష్టాల్లో ఉన్నప్పుడుమంత్రి పట్టించుకొవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం మంథనికి పూజలు యాగాలు తమ వ్యక్తి గత పనుల కొరకే చుట్టం చూపుల అలా వచ్చి ఇలా వెళుతున్నారని స్థానికంగా ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ప్రజల సమస్యలను పరిష్కారము కావడం లేదని పూర్తిగా గాలి కదిలేసినట్లు ప్రజలు మాట్లాడుకుంటున్నారు. పేరు గొప్ప ఊరికి దిబ్బ అన్నట్టుగా ఉందని అంటున్నారు. కొందరు అధికారులు కూడా ప్రజల సమస్యలను పరిష్కారించడం లేదని అంటున్నారు. ప్రజల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కారించి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించి ఆదుకోవాలని రైతులు కంటి నీరుతో ఆవేదన చెందుతున్నారు

# లడ్డు వేలం పాటలో విఘ్నేశ్వరుడి లడ్డును దక్కించుకున్న అంబటి రఘుపతి రాజు



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) హబ్సిగూడ డివిజన్ రామ్ రెడ్డి నగర్ కాలనీ నెంబర్ నాలుగు లో జై గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాల నుండి గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని సాగర్ తీరానికి బయలు దేరిన గణనాధుని లడ్డు వెళ్ళాం పాట లో అంబటి రఘుపతి రాజు 35 వేలకు లడ్డును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా అంబటి రఘుపతి రాజు మాట్లాడుతూ విగ్నేశ్వరుడి ఆశీర్వాదంతో లడ్డును దక్కించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, గణపతి ఆశీర్వాదంతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆ విఘ్నేశ్వరుని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేష్, నర్సా గౌడ్, సోనీ, సుధాకర్, గిరి, ఆంజనేయులు, చందన్, సాయి, కాలనీవాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# లక్షా ఎనిమిది వేల రూపాయలు పలికిన బజరంగ్ లడ్డు



నాచారం(ప్రశ్న న్యూస్) నాచారం రాఘవేంద్ర నగర్ లో భజరంగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డు ప్రసాదం వేలం పాటలలో ఎన్నడూ లేని విధంగా రికార్డ్ స్థాయిలో పలికింది. శనివారం రాత్రి వినాయకుడి నిమజ్జనం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడి లడ్డు ప్రసాదాన్ని వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో కాలనీ కి చెందిన పలువురు పోటీ పడ్డారు. రాజు అతని స్నేహితుడు సైదులు లు వేలం పాటలలో లడ్డును లక్షా 8వేలకు దక్కించుకున్నారు. లక్కీ డ్రా ద్వారా రాఘవేంద్ర నగర్ కు చెందిన ప్రశాంత్ కు లడ్డు లభించింది. స్వామివారి లడ్డు ప్రసాదం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు రాజు, సైదులు , ప్రశాంత్ లు సంతోషం వ్యక్తం చేశారు.

# నిర్వాసితుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యం

**- ప్రత్యేక ప్యాకేజి కింద 4696 ఇండ్లు మంజూరు**

**- రూ.240 కోట్లు వ్యయం**

**- మధ్యమానేరు నిర్వాసితులకు పెద్ద ప్యాకేజి**

**-1550 మందికి ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు**

**- ప్రభుత్వం విప్, వేములవాడ ఎమ్మెల్యే : ఆది శ్రీనివాస్**





వేములవాడ (ప్రశ్న న్యూస్) మిడ్ మానేరు ప్రాజెక్ట్ నిర్వాసితులకు మేలు చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.వేములవాడ అర్బన్ మండలం,అగ్రహారంలోని శ్రీ కన్వెషన్ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మిడ్ మానేరు నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా అధికారులు పాల్గొన్నారు. మొత్తం 1,550 మందికి ప్రత్యేక ప్యాకేజీ కింద ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "ముంపు గ్రామాల ప్రజలకు న్యాయం చేయడం ప్రభుత్వ ప్రాధాన్యమని" అన్నారు. ఇప్పటి వరకు రూ. 240 కోట్లతో 4,696 ఇండ్లు మంజూరు చేశామని, గతంలో 389 ఇండ్లు, ప్రత్యేక కోటా కింద 950, తాజాగా 1,550 ఇండ్లతో కలిపి 2889 ఇండ్లు పంపిణీ చేశామని వివరించారు. అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుందని, ఎవరు ఆందోళన చెందవద్దని, అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారని భరోసా ఇచ్చారు. ప్రతి ఇంటికి రూ. 5 లక్షల సాయం నాలుగు విడతల్లో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుందని చెప్పారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారికి సంబంధించిన సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు,రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణ దేవరావు,హౌసింగ్ పీడీ శంకర్, ఎంపీడీఓ రాజీవ్ మల్హోత్ర, తహసీల్దార్ విజయ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# మా యూకేజీ సెంటర్ మాకే కావాలి..!!

**- విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం**



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) సెప్టెంబర్ 07: మండల పరిధిలోని వినోబానగర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ యూకేజీ తరగతులకు వినోబానగర్ పాఠశాల డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా పాఠశాలకు 1లక్ష 70వేలు, తరగతి గదులను మరమ్మత్తులు చేసుకొనుటకు మరియు గర్ల్స్ టాయిలెట్స్ నిర్మాణం కోసం 2 లక్షల రూపాయలు కూడా మంజూరు చేశారు. కానీ ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్, మరియు కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జడ్పీహెచ్ఎస్ జూలూరుపాడు, ఎస్ఎంసి తీర్మానం లేకుండా మండల విద్యాశాఖ అధికారి తాను పనిచేస్తున్న నరసాపురం కాంప్లెక్స్ లోని కాకర్ల ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేశారు. వినోబానగర్ గ్రామంలో యూకేజీ తరగతులు నడిపించడానికి ప్రభుత్వం ఒక టీచరు ఒక ఆయా రిక్రూట్మెంట్ చేస్తుంటే తమ గ్రామంలో ఉన్న వారికి ఆ సదుపాయాలు రాకుండా మండల విద్యాశాఖ అధికారి రానివ్వకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వినోబానగర్ పాఠశాలకు తిరిగి యూకేజీ తరగతులు జరిగే విధంగా వచ్చే విధంగా మరల వినోబా నగర్ గ్రామంలో నోటిఫికేషన్ ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారికి వినోబానగర్ గ్రామస్తులు విన్నవించుకున్నా తాను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న గ్రామస్తులు మండల విద్యాశాఖ అధికారి ఏ ఉద్దేశంతో బదిలీ చేశారో దానికి కారణమేమిటో తెలియజేయాలన్నారు. వినోబానగర్ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని ఆటస్థలం, తరగతులు, టాయిలెట్స్ ఉండగా మొత్తం విద్యార్థులు 60 మంది ఆ పాఠశాలలో చదువుతున్నారని అదనంగా ఇంకొక భవనం ఉందని, మా యూకేజీ సెంటర్ మాకే కావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దేవారు ఉపాధ్యాయులు - దువ్వ వైశాలి

**- శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం**

**- ఒక రోజు ప్రధానోపాధ్యాయురాలిగా : దువ్వ వైశాలి**





వేములవాడ ( ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దువ్వ విజయ్ – రేణుక దంపతుల కుమార్తె దువ్వ వైశాలి ప్రధానోపాధ్యాయురాలిగా ఒక రోజు బాధ్యతలు చేపట్టింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వైశాలి మాట్లాడుతూ – "ఉపాధ్యాయులు మన (విద్యార్థుల) జీవితాలను తీర్చిదిద్దే శిల్పులు. వారు నేర్పిన మార్గదర్శకత్వం వల్లే మనం విజయపథంలో ముందుకు సాగగలుగుతాం. ఈ రోజు నాకు ఇచ్చిన ఈ గౌరవం చాలా ప్రత్యేకంగా అనిపిస్తోంది. భవిష్యత్తులో నేను కూడా సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా అవతరించాలని కృతనిశ్చయంతో ఉన్నాను" అని తెలిపింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# శ్రీ హనుమాన్ దేవాలయం ద్వారబంధనం - నేటి నుంచి దర్శనాలు యధావిధిగా

**ఆలయ ఈఓ .: నాగారపు శ్రీనివాస్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారంలోని శ్రీ హనుమాన్ దేవాలయం ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయ ద్వారాలను మూసివేసినట్లు,నేడు సోమవారం ఉదయం ప్రాతఃకాల పూజలు, సంప్రోక్షణ కార్యక్రమాలు పూర్తయిన అనంతరం భక్తులకు యధావిధిగా దర్శనాలు కల్పించనున్నట్టు, భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఆలయ ఈఓ నాగారపు శ్రీనివాస్ వెల్లడించారు.

# ఈత మొక్కలు నాటి హైమాస్ లైట్లను ప్రారంభించిన విప్ ఆది



మేడిపల్లి (ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గం,మేడిపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న పనుల జాతరలో భాగంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈత మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన స్వయంగా ఈత మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు.తరువాత అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన హైమస్ లైట్లను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి, సౌకర్యాల విస్తరణ కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు.

# ఇంటింటికి బాబు షూరిటీ మోసం గ్యారంటీ రీకల్ చంద్రబాబు అనే ప్రోగ్రాం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ఏర్పేడు మండలం ముసలిపేడు గ్రామపంచాయతీ బత్తినయ్య కాలనీలో ఇంటింటికి బాబు షూరిటీ మోసం గ్యారంటీ రీకల్ చంద్రబాబు అనే ప్రోగ్రాంను ప్రతి ఇంటికి పోయి స్కాన్ చేసి వారికి ఏ ఏ పథకాలు రాలేదు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎంత నష్టపోయారో వివరిస్తూ ప్రతి ఇంటికి వివరించడం జరిగింది ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా ఏర్పేడు మండల ఇంచార్జ్ గిన్నెరి.కిషోర్ రెడ్డి వైసీపీ మండల అధ్యక్షులు రమణయ్య యాదవ్ ఆధ్వర్యంలో అశేష జన వాహిని మధ్య జరిగింది ఈ కార్యక్రమానికి వైస్ ఎంపీపీలు జి.శ్రీనివాసులు.టి. జనార్ధన్ రెడ్డి కోఆప్షన్ నెంబర్ బత్తి శెట్టి.సర్పంచ్ మోహన ప్రియ. సర్పంచ్ నిర్మలమండల ఉపాధ్యక్షులు మునికృష్ణారెడ్డి మండల నాయకులు ఎక్స్ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి సింగల్ విండో ఎక్స్ చైర్మన్ నాగార్జున రెడ్డి సీనియర్ నాయకులు బత్తయ్య యాదవ్ వౌ శేఖర్ రెడ్డి.ప్రభాకర్ రెడ్డి గురునాథం. ప్రభాకర్ రెడ్డి గురువారెడ్డి.వెంకటేష్ యాదవ్ మహేష్ నాగూర్ రెడ్డి సోషల్ మీడియా అధ్యక్షులు కేశవులు. జిపి యాదవ్ యువ నాయకులు వినోద్ రెడ్డి.కుమార్ కమలాకర్ సుబ్బమ్మ జయశ్రీ తదితర మండల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# స్వాతిముత్యం డైరెక్టర్‌తో సంతోష్ శోభన్ కామెడీ ఎంటర్‌టైనర్



గోల్కొండ హైస్కూల్ సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై లీడ్ రోల్‌లో డెబ్యూ ఇచ్చి అందరినీ సర్‌ప్రైజ్ చేశాడు సంతోష్ శోభన్. కొత్తదనంతో కూడిన కథలను ఎంపిక చేసుకుంటూ ప్రేక్షకులకు వినోదాన్ని అందించే ప్రయత్నంలో ఎప్పుడూ ముందుంటాడు సంతోష్ శోభన్. అయితే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నా సంతోష్ శోభన్‌కు ఆశించిన స్థాయిలో బ్రేక్ మాత్రం పడటం లేదు.ఇదిలా ఉంటే ఈ యంగ్ యాక్టర్ స్వాతిముత్యం ఫేం లక్ష్మణ్ కే కృష్ణ డైరెక్షన్‌లో సినిమాకు సంతకం చేశాడు. లక్ష్మణ్ కే కృష్ణ చాలా రోజులకు సంతోష్ శోభన్‌కు సెట్టయ్యే కథాంశంతో ఆడియెన్స్ ముందుకు రాబోతున్నాడట. ఇంకా టైటిల్ ఫిక్స్ చేయని ఈ ప్రాజెక్ట్ వచ్చే నెలలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ చిత్రాన్ని 2026 వేసవిలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉండబోతుందట.

బెల్లంకొండ గణేశ్‌ను పరిచయం చేస్తూ తెరకెక్కించిన స్వాతిముత్యం విక్కీ డోనర్ లైన్‌లో సాగుతూ ప్రేక్షకుల నుంచి మిక్స్‌డ్ రెస్పాన్స్ రాబట్టుకుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సపోర్ట్‌తో సినిమా చాలా మంది ప్రేక్షకులకు రీచ్ అవ్వగా.. భావోద్వేగపూరిత అంశాలను హ్యాండిల్ చేయడంలో లక్ష్మణ్ కే కృష్ణ సక్సెస్ అయ్యాడనే చెప్పాలి.కాగా ఇదిలా ఉంటే సంతోష్ శోభన్ ఇప్పటికే మూడు సినిమాలను లైన్‌లో పెట్టాడు. కపుల్ ఫ్రెండ్లీ, జోరుగా హుషారుగా షికారు పోదామా సినిమాలతోపాటు మరో ప్రాజెక్ట్‌ను కూడా ఓకే చేశాడు.

# హాట్ హాట్‌గా జూనియర్ ఐశ్వర్యారాయ్

## స్నేహ ఉల్లాల్ మళ్లీ వచ్చేసింది..!

ఉల్లాసంగా ఉత్సాహంగా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది ఒమన్ సుందరి స్నేహ ఉల్లాల్. మెస్మరైజింగ్ లుక్, మెరిసే కళ్లతో జూనియర్ ఐశ్వర్యారాయ్‌గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ పలు తెలుగు చిత్రాల్లో నటించింది. తెలుగులో చివరగా 2013లో యాక్షన్ 3డీ మూవీలో మెరిసిన ఈ భామ ప్రస్తుతం హిందీ సినిమాలతో బిజీగా ఉంది.అయితే చాలా కాలంగా టాలీవుడ్‌లో కనిపించని ఈ బ్యూటీ తాజాగా బికినీలో అందాలు ఆరబోస్తూ నెట్టింట పోస్ట్ చేసిన ఫొటోలు హాట్ టాపిక్‌గా మారాయి. బ్లాక్ బికినీలో హాట్ హాట్‌గా హొయలుపోతూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. పిల్లి కళ్ల సుందరి స్నేహ ఉల్లాల్ డార్క్‌షేడ్స్‌లో మెస్మరైజ్ చేస్తూ నెటిజన్లు, కుర్రకారుకు నిద్రపట్టకుండా చేస్తోంది. మియావ్ (పిల్లి కూత).. అంటూ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. అందాల హద్దులు చెరిపేసిన ఈ బ్యూటీ మరి తెలుగులో ఏదైనా సినిమా అనౌన్స్‌మెంట్ చేయనుందా..? ఏంటి అని తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు.



# పవన్ కల్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ నయా షెడ్యూల్ షురూ..

## - ఇంతకీ ఎక్కడో తెలుసా..?



ఇటీవలే హరిహరవీరమల్లు పార్టు 1 సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ . ప్రస్తుతం తన ఫోకస్ ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలపై పెట్టాడు. హరీష్ శంకర్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ . లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తోంది. కాగా ఈ మూవీ కొత్త షెడ్యూల్‌కు సంబంధించిన క్రేజీ అప్‌డేట్ ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది.ఈ మూవీ కొత్త షెడ్యూల్ ఇవాళ హైదరాబాద్‌లో మొదలైంది. ఈ షెడ్యూల్‌లో పవన్ కల్యాణ్, రాశీఖన్నా జాయిన్ అయ్యారు. పవన్ కల్యాణ్, రాశీఖన్నాపై వచ్చే సాంగ్‌ను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. కొరియోగ్రఫర్ దినేశ్ మాస్టర్ నేతృత్వంలో సాంగ్ షూట్ కొనసాగుతుంది. ఈ షెడ్యూల్ కొన్ని రోజులపాటు కొనసాగనుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విడుదల చేసిన ఉస్తాద్ భగత్ సింగ్ ఫస్ట్ గ్లింప్స్ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందో హింట్ ఇచ్చేసింది.భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ ఉస్తాద్ భగత్ సింగ్‌లో తనదైన మ్యానరిజంతో సాగుతున్న పవన్ కల్యాణ్ డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. బ్లాక్ బస్టర్ గబ్బర్ సింగ్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

# బిగ్ బాస్ 9 గ్రాండ్ లాంచ్ ప్రోమో.. సెల్ఫ్ నామినేట్ అయిన కంటెస్టెంట్



బుల్లితెర ప్రతిష్టాత్మక రియాలిటీ షో బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 ఎట్టకేలకు ప్రారంభం కానుంది. ఈ సారి "డబుల్ హౌస్ – డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్" అనే కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఫస్ట్ ఎపిసోడ్‌లోనే గ్రాండ్ లాంచ్ ప్లాన్ చేసిన షో టీమ్, హౌస్‌లోకి అడుగు పెట్టబోయే 14 కంటెస్టెంట్లను ఎంపిక చేసినట్టు సమాచారం.తొలి రోజు హౌస్‌లోకి 14 మంది కంటెస్టెంట్లు మాత్రమే ఎంట్రీ ఇవ్వనున్నారు. అయితే షో కొనసాగుతూ ఉండగా, మెల్లిమెల్లిగా ఈ సంఖ్య వైల్డ్ కార్డ్ ఎంట్రీల ద్వారా పెరగనుంది. ఆ వివరాలు త్వరలో అధికారికంగా వెల్లడవుతాయి. ఈసారి బిగ్ బాస్ సీజన్‌లో ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉండబోతోంది. సామాన్యులు, సెలబ్రిటీల మిళితంతో హౌస్‌లో సరికొత్త డైనమిక్స్ కనిపించనున్నాయి. తాజాగా లాంచ్ ప్రోమో విడుదల చేశారు. దాదాపు 2 నిమిషాల 29 సెకన్ల నిడివి ఉన్న ఈ ప్రోమోలో చాలా మంది కంటెస్టెంట్లను సగం మాత్రమే చూపించారు. 'ఊహకందని మార్పులు.. ఊహించని మలుపులు.. డబుల్ హౌజ్‌తో.. డబుల్ జోష్‌తో మీ ముందుకు వచ్చేసింది బిగ్ బాస్ సీజన్ 9ః అని నాగార్జున వాయిస్‌తో ప్రోమో మొదలు కాగా, నాగార్జున్ లుక్, స్టైల్, స్వాగ్ అదిరిపోయింది అని చెప్పాలి. ప్రోమోలో ఓ వ్యక్తి సూట్ కేసు పట్టుకుని నడుచుకుంటూ వస్తుంటాడ. అతను జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ అని అర్థమవుతంది. బిగ్ బాస్ సీజన్ 9 ఇందు వదన, సుందర వదనా వావ్' అంటూ మెగాస్టార్ చిరంజీవి స్లాంగ్ లో చెప్పడం చూస్తే కచ్చితంగా ఇమ్మాన్యుయేలే అని అర్థమై పోతుంది. ఇక 'పిక్చర్ అబీ బాకీ హై' అని లక్స్ పాప, హీరోయిన్ ఆశా శైనీ అంటుంది. ఇక హాకీ స్టిక్ తో కనిపించినది సీరియల్ నటుడు భరణి అని అనిపిస్తుంది. ఆ తర్వాత ఓ మేల్ కంటెస్టెంట్ చిన్న బాక్స్ పట్టుకుని బిగ్ బాస్ వేదిక పైకి వస్తాడు. 'బాక్స్‌ను తీసుకెళ్లడానికి పర్మిషన్ ఉందా' అని నాగార్జున అడగగా, అప్పుడు నాగ్ బిగ్ బాస్‌ని అడుగుతాడు. బిగ్ బాస్ అందుకు అనుమతి లేదని అంటాడు. అది నా బాడీలో ఓ భాగం. దయచేసి లోపలికి తీసుకెళ్లడానికి అనుమతి ఇవ్వండి' అని బిగ్ బాస్‌తో చెప్పిన కూడా అందుకు పర్మిషన్ ఇవ్వకపోవడంతో తాను ఇంటికి వెళ్లిపోతాడు. దాంతో ఆ కంటెస్టెంట్ బిగ్ బాస్ హౌస్ లోకి అడుగుపెట్టకుండానే బయటకు వెళ్లినట్టు అర్థమైంది. మొత్తానికి ప్రోమో భారీ అంచనాలు పెంచింది.

# స్టార్ హీరో సినిమాలని వెనక్కి నెట్టేసిన చిత్రం..

## ఓవర్సీస్‌లో అదిరిపోయే కలెక్షన్స్



ఎంత పెద్ద స్టారో హీరో సినిమా అయిన కథ బాగుంటేనే ఆ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తుందని మరోసారి నిరూపితం అయింది. టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మరోసారి కంటెంట్ బేస్డ్ సినిమా విజయం సాధించింది. భారీ అంచనాలతో వచ్చిన స్టార్ హీరోల సినిమాలు బాక్సాఫీస్ దగ్గర నిరాశపరిచిన ఈ సమయంలో, చిన్న చిత్రంగా విడుదలైన 'లిటిల్ హార్ట్స్' అద్భుతమైన ఓపెనింగ్స్‌తో ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. అమెరికాలో విడుదలైన మొదటి రోజే లిటిల్ హార్ట్స్ చిత్రం $115K గ్రాస్ వసూళ్లు నమోదు చేసింది. ఇది అదే రోజు విడుదలైన పలు స్టార్ సినిమాలపై స్పష్టమైన ఆధిపత్యాన్ని చూపించిందిఅమెరికా బాక్సాఫీస్ లెక్కల ప్రకారం చూస్తే.. లిటిల్ హార్ట్స్ సినిమా మొదటి రోజుకి 115K డాలర్లు రాబట్టింది. ఇది స్టార్ హీరో పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు , హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ లాంటి స్టార్ హీరోలతో వచ్చిన వార్ 2 కలెక్షన్లను కూడా దాటడం విశేషం. ఇక అనుష్క శెట్టి నటించిన ఘాటీ మాత్రం మొదటి రోజుకి 27K డాలర్ల వద్దే ఆగిపోయింది. ఒక చిన్న సినిమా ఓపెనింగ్స్ ఈ స్థాయిలో సెన్సేషన్ సృష్టించడమంటే, ప్రేక్షకుల మద్దతు ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. వార్ 2, హరిహర వీరమల్లు, ఘాటీ వంటి భారీ సినిమాలు ఆశించిన రీతిలో రాణించలేకపోయాయి. కాని, లిటిల్ హార్ట్స్ వంటి చిన్న సినిమా పాజిటివ్ టాక్‌తో ముందుకు దూసుకెళ్లడం గమనార్హం. కంటెంట్ ఉన్న సినిమాలకి ప్రేక్షకులు ఆదరణ చూపుతారనేది మళ్లీ మళ్లీ నిరూపితమవుతోంది.ఒకవేళ కథ బలంగా ఉంటే, స్టార్ కాస్టింగ్ లేకపోయినా సినిమా కమర్షియల్ విజయం సాధించగలదని ఈ చిత్రం ఋజువు చేసింది. ప్రారంభం నుంచి లిమిటెడ్ స్క్రీన్స్‌లో రిలీజ్ అయినా, పాజిటివ్ టాక్‌తో పాటు మౌత్ పబ్లిసిటీ బాగా వర్కౌట్ కావడంతో, రెండో రోజు నుంచి స్క్రీన్ల సంఖ్యను పెంచారు. దీంతో కలెక్షన్ల పరంగా మరింత మెరుగైన ట్రెండ్‌ను ప్రదర్శిస్తోంది.ట్రేడ్ విశ్లేషకుల ప్రకారం, సినిమా వరల్డ్ వైడ్ బ్రేక్ ఈవెన్‌ను ఇప్పటికే పూర్తి చేసుకుని, క్లీన్ హిట్‌గా నిలిచింది. "ఓవర్సీస్ మార్కెట్‌లో దుమ్ము దులిపేస్తుంది. లిటిల్ హార్ట్స్ ఇచ్చిన ఫలితం వాస్తవికంగా ప్రేక్షకుల అభిరుచికి అద్దంపడుతోంది. మార్కెటింగ్ పెద్దగా లేకపోయినా, మంచి కథ, నెగెటివ్ టాక్ లేని సినిమాలు ఏ స్థాయిలో పని చేస్తాయో ఈ సినిమా ప్రూవ్ చేసింది. .

# విడుదలకు ముందే భారీ లాభాలు తీసుకొస్తున్న మిరాయ్!



తేజా సజ్జా హీరోగా వస్తున్న మిరాయ్ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. విభిన్నమైన కథాంశంతో, అద్భుతమైన గ్రాఫిక్స్ ఈ సినిమాపై విపరీతమైన హైప్ క్రియేట్ చేసింది. ఇది కాస్త పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి భారీ లాభాలను తీసుకొస్తుంది. సినిమా విడుదలకు ముందే దాదాపు 20 కోట్ల వరకు లాభాలు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. దీంతో బాక్సాఫీసు వద్ద గత సినిమాల నష్టాల నుంచి పీపుల్ మీడియా ఫ్యాకర్టీ తేరుకుంటుందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మిరాయ్ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రూ.60 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించింది. అద్భుత దృశ్యకావ్యంగా నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 12వ తేదీన థియేటర్లలో విడుదల కానుంది. కానీ ఇప్పటికే ఈ సినిమా నాన్ థియేట్రికల్ హక్కులు ( ఓటీటీ, శాటిలైట్ హక్కులు) కింద దాదాపు 45 కోట్లను సంపాదించిందని తెలుస్తోంది. దీంతో టేబుల్ ప్రాఫిట్ కింద రూ.20 కోట్లు అందుకుందని సమాచారం. ప్రస్తుతం బాక్సాఫీసు దగ్గర సినిమాల ఫలితాలను బట్టి చూస్తే ఇది చిన్న విజయం కాదనే చెప్పొచ్చు. ఎందుకంటే.. ఈ ఏడాదిలో వచ్చిన భారీ బడ్జెట్ చిత్రాలు.. తిరిగి డబ్బులను తీసుకురావడంలో విఫలమయ్యాయి. ముఖ్యంగా పాన్ ఇండియా ట్రెండ్‌ను ఫాలో అవుతూ, మార్కెట్‌ను మించి బడ్జెట్ పెట్టడం ద్వారా ఇలాంటి పొరపాట్లు జరుగుతున్నాయి. కానీ ఈ విషయంలో తేజా సజ్జా తెలివిగా వ్యవహరిస్తున్నారు. అనవసరపు హడావుడికి వెళ్లకుండా కంటెంట్ ప్రాధాన్యం ఉన్న సినిమాలను ఎంచుకుంటున్నాడు. అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కూడా కంటెంట్‌ను నమ్ముకునే మిరాయ్ సినిమాను తెరకెక్కించింది. పాన్ ఇండియా స్టోరీ అని భారీ బడ్జెట్, స్టార్ క్యాస్టింగ్ జోలికి వెళ్లకుండా రూ.60 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించింది. అదనపు హడావుడితో కాకుండా కంటెంట్‌ను నమ్ముకుని ఈ సినిమాను నిర్మించింది. ఇటీవల విడుదలైన మిరాయ్ ట్రైలర్ దాన్ని నిరూపిస్తోంది. తాజాగా విడుదలైన మిరాయ్ ట్రైలర్‌కు తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ అంచనాల కారణంగానే డైరెక్ట్‌గా తామే ఈ సినిమాను రిలీజ్ చేయాలని మేకర్స్ నిర్ణయించుకున్నారు. థియేట్రికల్ హక్కుల కోసం ప్రీమియం చెల్లించేందుకు డిస్ట్రిబ్యూటర్లు సిద్ధంగా ఉన్నప్పటికీ, కంటెంట్‌పై ఉన్న నమ్మకం కారణంగా ఈ సినిమాను మేకర్స్ సొంతంగా విడుదల చేస్తున్నారు. రిలీజ్‌కు ముందే రూ.20 కోట్ల వరకు లాభాలు తీసుకొచ్చిన మిరాయ్.. విడుదల తర్వాత మరెన్ని లాభాలు తీసుకొస్తుందో చూడాలి.!

# దుబాయ్‌లో ఘనంగా జరిగిన సైమా అవార్డ్స్

## ఉత్తమ చిత్రాలుగా 'అమరన్', 'మంజుమ్మల్ బాయ్స్'



దక్షిణ భారత చలనచిత్ర రంగంలో ప్రతిష్టాత్మకంగా నిలిచిన సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ వేడుక ఈ ఏడాది దుబాయ్ వేదికగా అత్యంత అట్టహాసంగా జరిగింది. శనివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో తమిళం, మలయాళం చిత్ర పరిశ్రమలకు సంబంధించిన నటీనటులకి పురస్కారాలు అందించారు. దక్షిణాది సినీ పరిశ్రమల ప్రముఖులు, దర్శకులు, నటీనటులు పెద్ద ఎత్తున హాజరై వేడుకను మరింత రక్తికట్టించారు. కోలీవుడ్ (తమిళం) విభాగంలో ఉత్తమ చిత్రంగా అమరన్ ఎంపికైంది. ఇదే చిత్రానికి గాను సాయి పల్లవికి ఉత్తమ నటి అవార్డ్ దక్కింది. మాలీవుడ్ (మలయాళం) విభాగంలో ఉత్తమ చిత్రంగా మంజుమ్మల్ బాయ్స్ ఎంపికైంది. ఇక ఉత్తమ నటుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ అవార్డ్ అందుకున్నారు. ఇక సినీ రంగానికి దశాబ్దాల పాటు సేవలు అందించిన నటుడు శివకుమార్‌కి ప్రత్యేక అవార్డ్ అందించారు. అలానే పలు భాషల్లో మెరిసిన ప్రముఖ నటి త్రిషకు ప్రత్యేక గౌరవ పురస్కారాలు అందించారు. ఈ అవార్డ్స్ వేడుకలో రెడ్ కార్పెట్‌పై విభిన్నమైన డిజైనర్ ఔట్‌ఫిట్స్‌తో మెరిసిన నటి నటులు, ప్రదర్శించిన లైవ్ పెర్ఫార్మెన్స్‌లు అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 2025 మొదటి రోజు కార్యక్రమం తెలుగు, కన్నడ పరిశ్రమలకి సంబంధించిన ప్రముఖుల మధ్య జరిగింది. ఆ తర్వాతి రోజు తమిళం, మలయాళం విభాగాలకు సంబంధించిన అవార్డులు ప్రకటించారు.

# రైతు సంక్షేమంలో రేగులపాటి కృష్ణదేవరావు విశేష కృషి

**- యూరియా సరఫరాలో కృష్ణదేవ రావు కీలకపాత్ర**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ అర్బన్ మండలం,రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు రైతుల కోసం విశేష కృషి చేస్తున్నారు. సొసైటీ పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా ఎరువుల బస్తాలను సమయానికి తెప్పించి అందుబాటులో ఉంచినందుకు పలువురు రైతులు ఆయన సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, "కృష్ణదేవరావు ఎప్పటికప్పుడు మా సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో ముందుంటారు. ముఖ్యంగా పంట సాగులో కీలకమైన యూరియా సరఫరా కోసం చేసిన కృషి అమూల్యం" అని అన్నారు.రైతు సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తూ, అవసరమైన సమయంలో రైతులకు అండగా నిలుస్తున్న కృష్ణదేవరావు సేవలను ప్రశంసిస్తూ పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## నేడు రాజకీయ పార్టీల నాయకులతో ముఖ్య సమావేశం

**- బోయినిపల్లి ఎంపీడీఓ : జయశీల**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** బోయినిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నేడు సోమవారం ఉదయం 11:00 గంటలకు వివిధ రాజకీయ పార్టీల నేతలతో ముఖ్య సమావేశం నిర్వహించబడుతుంది.ఈ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల మండల స్థాయి అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు పాల్గొంటారు. ఇందులో స్థానిక సంస్థల 2వ సాధారణ ఎంపీటీసీ / జడ్పీటీసీ ఎన్నికల ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల తుది జాబితా ప్రకటన, అభ్యంతరాల స్వీకరణ వంటి అంశాలపై చర్చ జరుగుతుందని సకాలంలో నాయకులు హాజరై సహకరించాలని బోయినిపల్లి ఎంపీడీఓ భీమా జయశీల కోరారు.

## గ్రహణం కారణంగా రాజన్నాలయం మూసివేత

**- నేడు భక్తుల దర్శనానికి ఏర్పాట్లు - ఆలయ ఈఓ : రమాదేవి**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** ఆదివారం ఉదయం 11:25 గంటల వరకు ఆలయంలోని అన్ని పూజా కార్యక్రమాలు ముగించడంతో, శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం సహా అనుబంధ ఆలయాలను మూసివేశామని ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు.

నేడు సోమవారం గ్రహణ మోక్షకాలం అనంతరం ప్రాతఃకాలం 3:45 గంటలకు సంప్రోక్షణ నిర్వహించిన తర్వాత, మంగళ వాయిద్యాలతో సుప్రభాతం చేసి, పూజలు జరిపి భక్తులకు దర్శనానికి అవకాశం కల్పిస్తామని ఆమె చెప్పారు. ఇకపై నిత్య విధులు యథావిధిగా కొనసాగుతాయని భక్తులు గమనించాలని ఈఓ సూచించారు.

## కాంగ్రెస్ అగ్రనేతలపై అవమానకర వ్యాఖ్యలు

**- బోయినిపల్లి ఠాణాలో ఫిర్యాదు**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు, ఫోటోలు పోస్ట్ చేసిన ఇద్దరు వ్యక్తులపై బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ "దేశానికి సేవ చేసిన నేతలపై ఇలాంటి వ్యాఖ్యలు తగవు.బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అన్నారు.ఫిర్యాదు అందజేసిన వారిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్, మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్ కుమార్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఏనుగుల ప్రశాంత్ కుమార్, పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి, అమ్మిగల్ల గోపాల్, మొగులోజి శ్రీకాంత్, నక్క శ్రీకాంత్, గుంటి జలందర్, ఎమిరెడ్డి దిలీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## డ్యాన్స్ చేస్తూ కానిస్టేబుల్ మృతి



హైదరాబాద్ : మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఓ కానిస్టేబుల్ డాన్స్ చేస్తూ కుప్పకూలిపోయాడు. అప్రమత్తమైన పోలీసు సిబ్బంది.. సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతి చెందిన కానిస్టేబుల్‌ని విష్ణుపురి కాలనీకి చెందిన డేవిడ్(31)గా పోలీసులు గుర్తించారు. ఈ కానిస్టేబుల్ ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. మృతుడి నివాసంలో విషాయఛాయలు అలుముకున్నాయి.

# వెయిట్‌లిఫ్టింగ్ లీగ్ 2025-26 ఘనంగా ప్రారంభం



**తార్నాక(ప్రశ్న న్యూస్)** ,కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వశాఖ, మరియు ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ సహకారంతో, తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అస్మిత వెయిట్‌లిఫ్టింగ్ లీగ్ 2025-26 లలాపేట్ ప్రొఫెసర్ జయశంకర్ ఇండోర్ స్టేడియం వెయిట్‌లిఫ్టింగ్ హాల్‌లో ఘనంగా ప్రారంభమైంది తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు మరియు ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు శ్రుతీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ "ఖేలో ఇండియా %-% అస్మిత కార్యక్రమం కింద నిర్వహిస్తున్న ఈ లీగ్ ప్రత్యేకించి పూర్తిగా మహిళలకు మాత్రమే అన్నారు. యువ, జూనియర్, సీనియర్ విభాగాల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన 80 మంది యువతులు పాల్గొన్నారని, ఈ లీగ్‌లో అర్హత సాధించిన ఆటగాళ్లు త్వరలో బెంగళూరులో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. ఈ లీగ్ తెలంగాణలో మహిళల వెయిట్‌లిఫ్టింగ్‌కు మైలురాయి అని, ఇది దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే కాకుండా, యువ క్రీడాకారిణులకు జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపునిస్తుంది అన్నారు.తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వెంకట రమణ పుసపాల మాట్లాడుతూ "రాష్ట్రంలో వెయిట్‌లిఫ్టింగ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. అస్మిత ద్వారా తెలంగాణకు ప్రాతినిధ్యం వహించే మహిళా లిఫ్టర్లకు స్పష్టమైన మార్గాన్ని సృష్టించి, భారతదేశానికి ప్రపంచ వేదికపై గౌరవాన్ని తీసుకురావడమే లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు సీనియర్ అడ్వకేట్ తిరుపతయ్య అతిథిగా పాల్గొని విజేతలకు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు : మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**- ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ అంజి రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత**



**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** జగిత్యాల జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం-2025 సందర్భంగా జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జిల్లా స్థాయి అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని , జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత, ఎమ్మెల్సీ అంజి రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఉపాధ్యాయుల సేవలను ప్రశంసిస్తూ, విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారని తెలిపారు.కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజి రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత, ప్రజాప్రతినిధులు, అధికారులు,బోధకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని శాఖల అధికారులను అభినందించిన ఎస్పీ అశోక్ కుమార్

**- రాత్రింబవళ్లు కష్టపడ్డ జిల్లా పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపిన జిల్లా ప్రజలు**



**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో రాత్రింబవళ్లు కష్టపడ్డ గత నెల 27వ తేదీన ప్రారంభమమై జిల్లాలో ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేసిన జిల్లా పోలీసు యంత్రంగానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు దాదాపు 9 లక్షల 95 వేల మంది కృతజ్ఞతలు తెలిపారు. సమిష్టి కృషితో నిమజ్జనాన్ని ప్రక్రియ పూర్తి చేయడం జరిగింది అని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లాలో 3500 పైగా గణేష్ మండపాల నుండి విగ్రహాలు శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేయబడ్డాయిని నిమజ్జన ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, ఆరోగ్యశాఖలు సహకారంతో సమన్వయంగా పనిచేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని ఎస్పీ అన్నారు. గడిచిన 11 రోజులపాటు 24 గంటలు పని చేసిన పోలీస్ అధికారులు, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది యొక్క కృషి వల్లనే గణేష్ ఉత్సవాలను విజయవంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకున్నామని దీనికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. అదేవిధంగా నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణలో ట్రాన్స్‌జెండర్స్ సక్రమంగా విధులు నిర్వర్తించి తమ వంతు పాత్ర పూర్తి చేసినందుకు అభినందనలు తెలియజేశారు. జిల్లా ప్రజలు, మండపాల నిర్వాహకుల సహకారం వల్ల గణేష్ ఉత్సవాలు,నిమజ్జనం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ సాఫీగా ముగిసిందని ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, మండపాల నిర్వాహకులకు ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ రాబోవు రోజుల్లో జరిగే పండుగలను ఇదే స్ఫూర్తితో జరుపుకోవాలని కోరారు.

# కుభీర్‌లో ప్రశాంతంగా ముగిసిన వినాయక నిమజ్జనం



కుభీర్ : నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో గణేశ్ నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన వినాయక నిమజ్జన శోభాయాత్ర ఆదివారం ఉదయం 11 గంటలకు ముగిసింది. శ్రీ విఠలేశ్వర ఆలయం, యాదవ, మున్నూరు కాపు సంఘాలతో పాటు బృందావన్ కాలనీకి చెందిన వినాయక విగ్రహాలను సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజల అనంతరం భజనలు, కోలాటలు, మహిళల మంగళారతులతో వినాయకులను గంగమ్మ ఒడికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. యువజన సంఘాలు, యువక మండళ్లు, ఆయా కాలనీలకు చెందిన వినాయక విగ్రహాల శోభాయాత్ర శనివారం రాత్రంతా కొనసాగి ఆదివారం ఉదయం ఘనంగా ముగిసింది. ఎడ్లబండి పై వినాయకుని తరలించడంతో శోభాయాత్ర మండల ప్రజలను ఆకర్షించింది. కుభీర్, పల్సి లోని శ్రీ విఠలేశ్వర, కాశీవిశ్వనాథ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ముందుగా నిమజ్జన శోభాయాత్ర ప్రారంభించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరగటానికి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## అధికారుల నిర్లక్ష్యంతో జిల్లా ఆసుపత్రిలో తాగునీటి కొరత



ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో అధికారుల నిర్లక్ష్యంతో తాగు నీటి కొరత ఏర్పడింది. రోగులకు తాగు నీరు లేక ఆసుపత్రిలో రోగులు, రోగి బంధువులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో కేవలం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒకే చోట తాగు నీటి వసతి ఉండటంతో మూడో అంతస్తులో ఉన్న రోగులు కింది వచ్చి నీరు పట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. అత్యవసరంగా తాగు నీరు కావలసిన వారు వాటర్ ప్లాంట్ సంబంధించిన మురికి నీరు వెళ్లే పైపుకు లీకేజీ ఉండటంతో నిమిషాల తరబడి అక్కడే నిలబడి లీకేజీ నుంచి నీటిని పట్టుకున్నారు. ఈ నీటిని తాగి అనారోగ్యం బారిన పడే అవకాశం లేకపోలేదని రోగులు వాపోతున్నారు. ఇప్పటికే వైరల్ ఫీవర్ కారణంగా ఆసుపత్రి రోగులతో నిండి ఉంది. ఇదే విషయమై ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణను ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన స్పందించలేదు.

## మహిళా, శిశు సంక్షేమం, సామాజిక శాసనాల ఫౌండేషన్ తెలంగాణ చైర్మన్‌గా వెంకటేష్ ముండే



జైనూర్ : తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం నాయకులు వెంకటేష్ ముండే మహిళా శిశు సంక్షేమం, సామాజిక శాసనాల ఫౌండేషన్ తెలంగాణ చైర్మన్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం చైర్మన్ గా నియమించింది. ఎవరైనా సామాజిక కార్యక్రమాలకు విరుద్ధంగా, మానవ హక్కులకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా బాధితులకు న్యాయం కలిగించేలా ఫౌండేషన్ పనిచేస్తుందని వెంకటేష్ ముండే తెలిపారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

వైజాగ్ పెట్రోలియం కంపెనీపై పిడుగుపాటు.. భారీగా ఎగిసిపడిన మంటలు AP New ఎ విశాఖపట్నంలోని ఈస్టిండియా పెట్రోలియం కంపెనీలో భారీ ప్రమాదం జరిగింది. నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కంపెనీలోని పెట్రోల్ ఫిల్టర్ ట్యాంక్‌పై పిడుగుపడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

## వైజాగ్ పెట్రోలియం కంపెనీపై పిడుగుపాటు.. భారీగా ఎగిసిపడిన మంటలు



విశాఖపట్నంలోని ఈస్టిండియా పెట్రోలియం కంపెనీలో భారీ ప్రమాదం జరిగింది. నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కంపెనీలోని పెట్రోల్ ఫిల్టర్ ట్యాంక్‌పై పిడుగుపడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. 20 ఫైరింజన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా, వైజాగ్‌లో అగ్నిప్రమాద ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. అగ్నిమాపక శాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.పెట్రోలియం కంపెనీలో ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు.

# పేదలకు 5 రూపాయల భోజనం పథకం
# దూరం అవుతుందా.?

## - ఆధునికరణ పేరుతో నెలలకొద్ది నిర్లక్ష్యం

- రోజు రోజుకి 5 రూపాయల భోజనాన్ని పేద పుత్ పాత్ ప్రజలకు దూరం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం
- అన్నా క్యాంటీన్ పేరుతో గురువు మెరుగుపరుస్తున్నాడు, జిహెచ్ఎంసి నిర్వహించే అన్నపూర్ణ క్యాంటీన్ గాలికి వదిలేసిన శిష్యుడు
- 5 రూపాయల భోజనానికి నిలువ నీడ లేకుండా చేస్తున్న జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు పట్టించుకోని ప్రభుత్వం
- 5 రూపాయల భోజనం నాణ్యత లేకపోవడంతో తినలేక ఇబ్బంది పడుతున్న రోడ్డు మీద ఉండే పేద ప్రజలు
- టిఫిన్ లు పెడతామంటూ ఊరిస్తున్న వైనం






**నాగారం(ప్రశ్న న్యూస్)** జిహెచ్ఎంసి ఏర్పాటు చేసిన 5 రూపాయల భోజనం పథకాన్ని రోజు రోజుకు పేద ప్రజలకు అందకుండా చేస్తున్నారని రోజు ఆహారం తినే పేద ప్రజలు పుత్పాతుల మీద నివసించే పేద ప్రజలు 5 భోజన పథకం రాబోవు రోజుల్లో ఉంటుందా అన్న సందేహం కలుగుతుందని పెద్ద ఎత్తున ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్ నగర ప్రజలకు కేవలం 5 రూపాయలకే ఆహారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన అన్నపూర్ణ పథకం ఎంతో విజయవంతమైందని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. ప్రజా పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఆహార పథకం కింద, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లోని సాధారణ ప్రజల కోసం అన్నపూర్ణ క్యాంటిన్ ను సరికొత్తగా ప్రారంభించేందుకు సిద్ధమైంద లేక ఎత్తేస్తుందా అన్న సందేహం కలుగుతుందని పేద అభాగ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు కేవలం నిల్చునే రూ.5ల భోజనాన్ని తినాల్సి వచ్చేదని, ఇక నుంచి కూర్చుని తినేందుకు వీలుగా కొత్త క్యాంటిన్లను ఏర్పాటు చేయనున్నారా లేక పేదలకు దూరం చేయనున్నారా అన్న సందేహంతో 5 రూపాయల భోజనం చేసే పేద ప్రజలు. పేదలకు చాలా చౌకగా జిహెచ్ఎంసి ఏర్పాటు చేసిన 5 రూపాయల భోజనం క్యాంటీన్ రాబోవు రోజుల్లో ఉంటుందా ఫుత్పాతులపై ఉండే పేద అభాగ్యులు 5 రూపాయల భోజనానికి దూరం కానున్నారా లేక ఇబ్బందులు ఎదుర్కోనున్నారా అన్నా సందేహం, 5 రూపాయలు భోజనం తినే ప్రజలను పెద్ద ఆలోచనలో పడ్డారని ఈ ఉదాంతం చూస్తేనే అర్థమవుతుంది. అతి తక్కువ ధరకు స్వచ్ఛమైన టిఫిన్ లను భోజనాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వం అన్నపూర్ణ ఆహార పథకాన్ని ప్రారంభించిందని గత ప్రభుత్వం 2014లో ప్రారంభించినప్పటి నుంచి దాదాపు 10 కోట్ల మంది నగరవాసులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ ప్రభుత్వ పాలన చేసిందని పేద ప్రజలు అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రోడ్లపై ఉండే అభాగ్యులను 5 రూపాయల భోజనం పథకం మీద ఆధారపడ్డ పేదలను గాలికి వదిలేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇలాంటి అభాగ్యులకు పేద ప్రజలకు ఉదయం టిఫిన్ మధ్యాహ్నం మంచి భోజనం సాయంత్రం భోజనం ఇలాంటి సౌకర్యాలు అన్న క్యాంటీన్ పేరుతో విజయవంతంగా కొనసాగిస్తున్నారని అక్కడి ప్రజల మన్ననాలను రాష్ట్ర ప్రభుత్వం పొందుతూ ముందుకు సాగుతుందని అక్కడి అన్న క్యాంటీన్ చూస్తేనే అర్థమవుతుందని పలువురు విశ్లేషకులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఉండే రోడ్లపై ఉత్పాతులపై నివసించే టటువంటి అభాగ్యులకు పేద ప్రజలకు ఉదయం టిఫిన్ ను, మధ్యాహ్నం 5 రూపాయల భోజనాన్ని దూరం చేసే పనిలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు ఈ సంఘటనను చూస్తేనే అర్థమవుతుందని ఒకప్పుడు మంచి భోజనాన్ని అందించే జిహెచ్ఎంసి ఇప్పుడు మాత్రం మంచి భోజనాన్ని అందించడం లేదని రోజు రోజుకు 5 రూపాయల భోజనం తినాలంటే ఇబ్బందికరంగా మారిందని రోడ్లపై తినే పేద దిక్కులేని వారికి అన్నం దొరకలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసి అధికారులు చేస్తున్నారని ఇప్పటికైనా ఈ పథకాన్ని నిర్వహించే జిహెచ్ఎంసి అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని 5 రూపాయల భోజనాన్ని పునరుద్ధరించి టిఫిన్ లను మంచి భోజనాన్ని ఏర్పాటు చేయాలని పేద, ఫుట్ పాత్ మీద ఉండే ప్రజలు కోరుతున్నారు.

# బీఆర్ఎస్‌లో భూకంపం

## - కేసీఆర్‌కు కోలుకోలేని దెబ్బ.?




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్‌లో కలకలం రేపిన పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు కూతురు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తిరుగుబాటు, సస్పెన్షన్, ఆ పార్టీలో అంతర్గత కలహాలు ఒక్కసారిగా పార్టీ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయి. కేసీఆర్, ఒకప్పుడు తెలంగాణ ఉద్యమాన్ని జనంలోకి తీసుకెళ్లి, రాష్ట్ర సాధనలో చరిత్ర సృష్టించిన నాయకుడు, ఇప్పుడు సొంత కుమార్తె నుంచి వచ్చిన ఎదురుదాడితో మానసికంగా, రాజకీయంగా ఒత్తిడిలో పడ్డారు.

### - సొంత ఇంట్లో కుంపటి..

కవిత సస్పెన్షన్ బీఆర్ఎస్‌లో కేవలం ఒక క్రమశిక్షణా చర్య కాదు, అది పార్టీలోని అంతర్గత విభేదాలను బయటపెట్టిన ఒక రాజకీయ భూకంపం. కవిత, తన బంధువులైన హరీశ్‌రావు, సంతోష్‌కుమార్‌పై కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలు చేసి, ఈ ఆరోపణలు తన తండ్రి కేసీఆర్‌పై మచ్చ తెచ్చాయని ఆరోపించడం ద్వారా పార్టీలో గందరగోళం సృష్టించింది. ఈ ఆరోపణలు కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న విమర్శలకు బలం చేకూర్చాయి, దీంతో కేసీఆర్‌పై సీబీఐ దర్యాప్తు ఒత్తిడి మరింత పెరిగింది. కవిత గత మూడు నెలలుగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటూ, హరీశ్‌రావు, సంతోష్ కుమార్‌తోపాటు కేటీఆర్‌పై కూడా విమర్శలు గుప్పించింది. ఆమె తన సోదరుడు కేటీఆర్‌ను 'పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించడంలో విఫలమయ్యాడు' అని ఆరోపించడం, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని విమర్శించడం బీఆర్ఎస్ నాయకత్వానికి సవాల్‌గా మారింది. ఈ పరిణామాలు కేసీఆర్‌ను సస్పెన్షన్ నిర్ణయం తీసుకునేలా ఒత్తిడి చేశాయి, కానీ ఈ చర్య తీసుకునే ముందు ఆయన మూడు నెలలపాటు ఆలస్యం చేయడం పార్టీలో నియంత్రణ కోల్పోయినట్లు సంకేతాలు ఇచ్చింది.

### - కేసీఆర్‌పై మానసిక ఒత్తిడి..

కేసీఆర్‌కు ఈ ఎపిసోడ్ కేవలం రాజకీయ సమస్య కాదు, వ్యక్తిగతంగా కూడా ఒక భారీ దెబ్బ. 70 ఏళ్లు దాటిన వయస్సులో, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఆయనకు, సొంత కుమార్తె నుంచి ఎదురుదాడి ఊహించని గాయం కలిగించింది. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమాన్ని ఒక్కటిగా నడిపిన కేసీఆర్, ఇప్పుడు సొంత కుటుంబంలోనే విభేదాలను సమన్వయం చేయలేకపోతున్నారని విమర్శలు వస్తున్నాయి. కవిత ఆరోపణలు కేసీఆర్‌ను నేరుగా లక్ష్యం చేయకపోయినా, ఆమె హరీశ్‌రావు, సంతోష్ కుమార్‌పై చేసిన ఆరోపణలు కేసీఆర్ నాయకత్వంపైనే ప్రశ్నలు లేవనెత్తాయి. ఈ ఆరోపణలు కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తును మరింత ఊతం ఇచ్చాయి, దీంతో పార్టీ ఇమేజ్ దెబ్బతింది. మరోవైపు, కవిత సస్పెన్షన్ తర్వాత ఆమె తన ఎమ్మెల్సీ పదవితోపాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేయడం బీఆర్ఎస్‌కు మరింత నష్టం కలిగించింది. ఆమె నడిపిస్తున్న తెలంగాణ జాగృతి సంస్థ ద్వారా కొత్త రాజకీయ మార్గం ఎంచుకునే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇది బీఆర్ఎస్‌కు మరింత రాజకీయ నష్టాన్ని కలిగించవచ్చు.

### - 'స్థానిక' ఎన్నికల వేళ సవాళ్లు..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్‌కు కీలకం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత, పార్టీ ఇంకా బలమైన పునరాగమనం చేయలేకపోయింది. ఈ నేపథ్యంలో, కవిత సస్పెన్షన్, ఆమె రాజీనామా వంటి పరిణామాలు పార్టీ క్యాడర్‌లో గందరగోళం సృష్టించాయి. కాంగ్రెస్ నాయకుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకుని రాజకీయ ఒత్తిడి పెంచుతోంది.

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు, కవిత ఆరోపణలు ఈ ఒత్తిడిని మరింత తీవ్రతరం చేశాయి. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ తన పట్టు నిలబెట్టుకోలేకపోతే, పార్టీ నుంచి మరిన్ని ఫిరాయింపులు, తిరుగుబాట్లు జరిగే అవకాశం ఉంది. నిజామాబాద్ వంటి ప్రాంతాల్లో కవిత ప్రభావం గణనీయంగా ఉన్నప్పటికీ, ఆమె సస్పెన్షన్ తర్వాత పార్టీ క్యాడర్‌లో నిరాశ, గందరగోళం వ్యాపించాయి. ఈ పరిస్థితుల్లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు వంటి నాయకులు పార్టీని ఒక్కటిగా ఉంచడం పెద్ద సవాల్‌గా మారింది.

### - వైభవం ఇక గతమేనా.?

ఒకప్పుడు తెలంగాణ ఉద్యమాన్ని ఒక తాకిడిలా నడిపించి, రాష్ట్ర సాధన సాధించిన కేసీఆర్, జాతీయ రాజకీయాల్లో కూడా ప్రభావం చూపారు. కానీ 2023 ఎన్నికల ఓటమి తర్వాత, ఆయన ప్రజల్లోకి రాకపోవడం, ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం పార్టీ క్యాడర్‌లో నిరాశను కలిగించింది. ఇప్పుడు కవిత తిరుగుబాటు, సస్పెన్షన్ వంటి ఘటనలు ఆయన నాయకత్వంపై ప్రశ్నలు లేవనెత్తాయి. కేసీఆర్ ఒకవైపు పార్టీని, మరోవైపు కుటుంబాన్ని సమన్వయం చేయడంలో విఫలమయ్యారా అన్న చర్చ జోరందుకుంది.

కవిత సస్పెన్షన్‌తో ఆయన కఠిన నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఈ చర్య ఆలస్యమైందని, పార్టీలో నియంత్రణ కోల్పోయినట్లు సంకేతాలు ఇచ్చిందని విమర్శకులు అంటున్నారు. ఈ సంక్షోభం నుంచి బీఆర్ఎస్ బయటపడకపోతే, కేసీఆర్ గత వైభవం కేవలం చరిత్ర పుటల్లోనే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# గురుకులాలను నరక కూపాలుగా మార్చారు

## - రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల పరిస్థితిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గురుకులాలు నరక కూపాలుగా మారాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్, పాముకాట్లు, విష జ్వరాల బారిన పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు స్పందిస్తూ "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా గురుకులాలను పర్యవేక్షిస్తానని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. కల్తీ ఆహారం పెడితే జైలుకేనని చేసిన హెచ్చరికలు గాలి మాటలయ్యాయి" అని ఎద్దేవా చేశారు. గురుకులాల్లో పనిచేస్తున్న దాదాపు 2500 మంది కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఆడంబరపు ప్రకటనలు ఇచ్చే బదులు, వారికి సకాలంలో జీతాలు చెల్లించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో ప్రస్తుత పరిస్థితిని పోలుస్తూ, కేసీఆర్ హయాంలో గురుకులాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని హరీశ్ రావు గుర్తుచేశారు. "నాడు కేసీఆర్ గురుకులాల సంఖ్యను 294 నుంచి 1024కి, విద్యార్థుల సంఖ్యను లక్షా 90 వేల నుంచి ఆరున్నర లక్షలకు పెంచి నాణ్యమైన విద్యను అందించారు. విద్యపై పెట్టే ఖర్చును ఆయన పెట్టుబడిగా భావించారు. కానీ, కాంగ్రెస్ 22 నెలల పాలనలో గురుకులాల ఖ్యాతి అధఃపాతాళానికి పడిపోయింది" అని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి గాడితప్పిన గురుకుల వ్యవస్థను చక్కదిద్దాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న సిబ్బంది జీతాలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# సల్మాన్ ఖాన్ విమర్శలు చేసింది
# ట్రంప్ ను ఉద్దేశించేనా?

## - బిగ్‌బాస్ షోలో సల్మాన్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు





ముంబై (ప్రశ్న న్యూస్) ప్రముఖ రియాలిటీ షో బిగ్‌బాస్ వేదికగా బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఆయన పరోక్షంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారంటూ సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతోంది. ఈ వ్యాఖ్యలతో ఎంటర్‌టైన్‌మెంట్ షోలో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది. బిగ్‌బాస్ 19వ సీజన్ వీకెండ్ ఎపిసోడ్‌లో హోస్ట్ సల్మాన్ ఖాన్, హౌస్‌మేట్స్ మధ్య జరుగుతున్న గొడవలపై చర్చిస్తున్నారు. ఇంట్లో గొడవలకు కారణమవుతూనే, తామే శాంతి దూతలుగా చెప్పుకుంటున్న కొందరు కంటెస్టెంట్‌లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ క్రమంలో, "ప్రపంచంలో ఏం జరుగుతోందో చూడండి. సమస్యలను సృష్టించే వారే ఇప్పుడు శాంతి బహుమతి కావాలని అడుగుతున్నారు" అని సల్మాన్ వ్యాఖ్యానించారు. సల్మాన్ ఖాన్ ఎవరి పేరునూ ప్రస్తావించకపోయినా, ఈ వ్యాఖ్యలు నేరుగా డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించినవేనని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. తాను భారత్–పాకిస్థాన్ సహా అనేక యుద్ధాలను ఆపానని, అందుకే తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ట్రంప్ గత కొంతకాలంగా బహిరంగంగా కోరుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సల్మాన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో క్లిప్‌ను పలువురు నెటిజన్లు "బిగ్‌బాస్‌లో ట్రంప్‌పై సల్మాన్ విమర్శలు" అనే క్యాప్షన్‌తో షేర్ చేస్తున్నారు. సల్మాన్ చాలా ధైర్యంగా తన అభిప్రాయాన్ని చెప్పారని కొందరు ప్రశంసిస్తుండగా, దీనిపై ట్రంప్ ఎలా స్పందిస్తారో చూడాలంటూ మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఒక సాధారణ రియాలిటీ షోలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు

## - రేవంత్ రెడ్డి కీలక సమావేశం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ అనర్హత నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆదివారం జరిగిన ఈ భేటీలో తదుపరి అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. ఈ నోటీసులపై వివరణ ఇచ్చేందుకు తొలుత ఎమ్మెల్యేలు వారం రోజుల గడువు కోరారు. ఆ గడువు ముగియడంతో తదుపరి కార్యాచరణను నిర్ణయించుకునేందుకు వారంతా ముఖ్యమంత్రిని కలిశారు. అయితే, ఈ సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి మినహా మిగిలిన తొమ్మిది మంది హాజరయ్యారు. ఇటీవల పార్టీ ఫిరాయింపులపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఈ పరిణామాలకు మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. ఈ నేపథ్యంలో స్పీకర్ నోటీసులను న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలి, ఎలాంటి వివరణ ఇవ్వాలనే అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకు ఉన్న మార్గాలపై వారు లోతుగా మంతనాలు జరిపారు. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఫిరాయింపుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. తమ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ఈ భేటీ స్పష్టం చేస్తోంది. తదుపరి ఏం జరగనుందనే విషయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588